





వెండి అంబారీపై ఆది దంపతుల ఊరేగింపు

నేత్రపర్వం...ధ్వజారోహణం

శివనామస్మరణతో మార్మోగిన ముక్కంటి ఆలయం ● వెండి అంబారీపై ఆది దంపతుల పుర విహారం

శ్రీకాళహస్తి, మార్చి 4 : శ్రీకాళహస్తీశ్వరాలయ శివ రాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం ధ్వజా రోహణ వేడుక వేదోక్తంగా జరిగింది.మ ధ్యాహ్నం ప్రారంభమైన వేడుక సాయంత్రం వరకూ జరగ్గా భక్తుల శివనామ స్మరణతో ఆలయం మార్మో గింది.ఉదయం స్వామి అమ్మవార్ల మూలమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్ర జలాలను ఆలయంలో చల్లుతూ శుద్ధి చేశారు. అలంకార మండ పంలో స్వామి, అమ్మవార్లు వెండి అంబారీ వాహ నంపై ఆశీనులయ్యారు, వినాయకుడు, సుబ్రహ్మణ్య స్వామి, చండికేశ్వరుడి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి హారతులు సమర్పించారు. అనంతరం ఆలయం నుంచి శివయ్య గోపురం, రాజగో పురం మీదుగా వాహనాల మండపం వద్దకు తీసుకువచ్చారు.పం చమూర్తుల ఊరే గింపు



ధ్వజారోహణ పూజులు

చతుర్మాడ వీధుల్లో కనులపండువగా సాగింది. అనం తరం పంచమూర్తులను స్వామివారి గర్భాలయం వద్ద ఉన్న స్వర్ణతాపడ ధ్వజస్తంభం వద్ద కొలువుదీర్చారు. అలాగే ఉమాదేవి సమేత చంద్రశేఖర స్వామి త్రిశూలానికి ధ్వజస్తంభం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు ధ్వజారోహణం చేసే కొడి దారాన్ని పురవీ ధుల్లో సాంప్రదాయబద్ధంగా ఊరేగించారు. కలశ స్థాపనతో వేదోక్తంగా సంకల్ప పూజలు నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల మధ్య హోమం, పూజాది కైంక ర్యాలు నిర్వహించాక ధ్వజస్తంభానికి దర్భధారణ చేశారు. మంగళ వాయిద్యాలు, మేళ తాళాల మధ్య భక్తులు సమర్పించిన కొడి చీరలను ధవళ పతాకంతో కలిపి సకల దేవతలకు ఆహ్వానం పలుకుతూ ధ్వజ స్తంభానికి అధి రోహింపజేశారు.సాయంత్రం ఆరుగం టలకు ఆలయంలోని యాగశాలలో కలశస్థాపనతో విశేష పూజలు చేశారు. చతుర్మాడ వీధుల్లో వెలసిన నవ సంధి వినాయకులను శివపార్వతుల కళ్యాణా నికి విచ్చేయాలంటూ క్షేత్రధర్మంగా అర్చకులు ఆహ్వా నం పలికారు. రాత్రి వెండి అంబారీ వాహనంపై స్వామి అమ్మవార్లు పుర వీధుల్లో ఊరేగి భక్తులకు దర్శనమిచ్చారు.ముందుగా ప్రచార రథం, స్వాగత తోరణాలు, గొడుగులు, మంగళ వాయిద్యాలు, కోలాట నృత్యాలు, వివిధ కళాకారుల వాయిద్యాలు, వేషధా రుల ప్రదర్శనలు ఊరేగింపులో భక్తులను ఆకట్టుకు న్నాయి.అనువంశిక ప్రధాన అర్చకులు డాక్టర్ స్వామి నాథన్ గురుకుల్, ప్రధాన అర్చకులు, ఆలయ మాజీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈవో నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.ఉదయం ఊరేగింపులో డిప్యూటీ సీఎం నారాయణ స్వామి, ఎమ్మెల్యే బియ్యపు మధుసూదనరెడ్డి పాల్గొన్నారు.

నేడు భూత, శుక వాహన సేవలు

శివరాత్రి ఉత్సవాల్లో మంగళవారం భూతరాత్రిని పురస్కరించుకుని భూత గణాలకు ఆధిపత్యం వహి స్తున్న పరమేశ్వరుడు భూత వాహనంపై, ఆయన దేవేరి జ్ఞానప్ర సూనాంబిక చిలుక వాహ నంపై పురవీ ధుల్లో ఊరేగ నున్నారు. ఉదయం సూర్య ప్రభపై స్వామివారు, చప్పరంపై అమ్మవారు ఊరేగను న్నారు.



వెంకన్న సేవలో సమంత

తిరుమల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి):సినీ నటి సమంత సోమవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయం లోకి వెళ్లిన ఆమె ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపలకు వచ్చిన సమం తను చూసేందుకు యాత్రికులు ఉత్సాహం చూపారు. ఆమెతో కలిసి సెల్ఫీలు తీసుకునేందుకు ఎగబడ్డారు.

దొంగ ఓట్లు వేసుకునేందుకే ఎస్పీ బదిలీ

మలికా గార్గ్ బదిలీపై టీడీపీ, జనసేన ఆందోళన

తిరుపతి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): తిరుపతి ఎస్పీ మలికా గార్గ్ బదిలీపై విప క్షాలు మండిపడ్డాయి. వైసీపీ నేతల ఒత్తిళ్ల తోనే బాధ్యతలు చేపట్టిన మూడు వారాలు కూడా కాకుండానే ఆమెను హఠాత్తుగా బదిలీ చేశారంటూ ఆందోళన చేపట్టాయి.టీడీపీ-జనసేన శ్రేణులు సోమ వారం ఉదయం ఎన్టీఆర్ విగ్రహం వద్ద నిరసనకు దిగాయి. తిరుపతి ప్రశాంతతను కాపాడాలని, ఎస్పీ బదిలీ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్న నినాదాలతో హోరెత్తించాయి. సమాచారం అందుకున్న పోలీసులు నిరసనకారులను అదుపులోకి తీసుకుని వెస్ట్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ మాట్లాడుతూ ఎన్నికల్లో వైసీపీ అరాచకాలను ఉపేక్షించబోదన్న అనుమానంతోనే సిన్సియర్ అధికారిగా పేరున్న గార్గ్‌ను అర్ధంతరంగా బదిలీ చేశారని మండిపడ్డారు. ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఆమె పార్టీలకతీతంగా పారదర్శకంగా పని చేయడం అధికార పార్టీ నేతలకు మింగుడుపడలేద న్నారు.రాబోయే ఎన్నికల్లో కూడా దొంగ ఓట్లతో గెల వాలని భావిస్తున్న వైసీపీ నేతలు ఎస్పీ అడ్డుకట్ట వేస్తుందని భావించే బదిలీ చేయించారన్నారు. మరో నాలుగు రోజుల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకుంటుండగా నిజాయితీ కలిగిన మహిళా పోలీస్ అధికారిని బదిలీచేయడం బాధాకరమన్నారు. ఆందోళన చేస్తున్న వారిలో 24మందిని అదుపులోకి తీసుకుని వెస్ట్ పోలీస్ స్టేషన్‌కు తరలించిన పోలీ సులు బైండోవర్ కేసులు పెట్టారు. మధ్యాహ్నం 2.30 గంటలపైన సంతకాలు తీసుకుని విడుదల చేశారు. పోలీసులు అదుపులోకి తీసుకున్నవారిలో టీడీపీ నాయకులు నరసింహ యాదవ్, మబ్బు దేవనారా యణ రెడ్డి, ఆర్సీ మునికృష్ణ, పులుగోరు మురళీకృష్ణా రెడ్డి, ఊకా విజయకుమార్, డాక్టర్ కోడూరు బాలసు బ్రమణ్యం, బుల్లెట్ రమణ, చినబాబు, కంకణాల రజ నీకాంత్ నాయుడు, రుద్రకోటి సదాశివం, మునిశేఖర్ రాయల్, పెరుమాళ్ మధు, ఆముదాల తులసీరాం, కరాటే చంద్ర, మునిరామయ్య, వేణుగోపాల నాయుడు, జయకుమార్, ఆనంద నాయుడు, పూజారి రాజారాం, జనసేన నాయకులు రాజా రెడ్డి, ముక్కు సత్యవంతుడు, కొండ రాజా, దినేష్, రాజేష్, రుద్ర కిషోర్ తదితరులు ఉన్నారు. టీడీపీ నాయ కులు రవినాయుడు, బ్యాంకు శాంతమ్మ, హేమ, అనిత, విశ్వనాథం తదితరులు వెస్ట్ పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకుని ఆందోళనకారులకు సంఘీభావం ప్రకటించారు.



గంజాయి స్మగ్లింగ్‌లో ప్రజాప్రతినిధి హస్తం

- అరెస్టు చేస్తారన్న భయంతోనే ఎస్పీని బదిలీ చేయించారు
- బీజేపీ నేతల సంచలన ఆరోపణ

తిరుపతి (తిలక్‌రోడ్), మార్చి 4: గంజాయి స్మగ్లింగ్‌లో స్థానిక ప్రజాప్రతినిధి హస్తం వున్నట్లు ఎస్పీ విచారణలో బయటపడటంతో ఎక్కడ అరె స్టు చేస్తారో అనే భయంతోనే ఎస్పీ మలికా గార్గ్‌ను బదిలీ చేయించారని బీజేపీ అధికార ప్రతినిధులు భాను ప్రకాష్‌రెడ్డి, సామంచి శ్రీనివాస్ ఆరోపించారు. సోమవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పుణ్యక్షేత్రమైన తిరుపతిని వైసీపీ నాయకులు గంజాయివనంగా మార్చేశారంటూ ధ్వజమెత్తారు. దొంగ ఓట్లు, గంజాయి స్మగ్లింగ్, టీడీఆర్ బాండ్ల అవినీతిపై ఎస్పీ మలిక గార్గ్ నివేదిక తయారు చేస్తోందని తెలిసి ఎక్కడా తనను అరెస్టు చేస్తారో అనే భయం, ఎన్నికలకు ముందు ఇవన్నీ జరిగితే వైసీపీకి చెడ్డపేరు వస్తుందనే ఆలో చనతో ఎస్పీని బదిలీ చేయించారని ఆరోపించారు. నిజాయితీగా పనిచేసినం దుకే వైసీపీ ప్రభుత్వం బదిలీ బహుమానాన్ని ఒక మహిళా అధికారికి అందించడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికే వైసీపీ మాట విని ఓ ఐఏఎస్ అధికారి సస్పెండయ్యారని గుర్తు చేశారు.అధికార పార్టీ నాయకులు మాట వినకపో వడం ఓ కారణమైతే నిక్కచ్చిగా ఎన్నికల విధులు నిర్వర్తించాలని పోలీసు యంత్రాంగానికి సమావేశాల్లో ఎస్పీ చెప్పడం వైసీపీ నాయకులకు మింగుడుపడలేదన్నారు.ఈ విషయంపై ముఖ్యమంత్రే జవాబు చెప్పాల న్నారు.బదిలీ చేసిన ఎస్పీని వెంటనే తిరిగి తిరుపతికి బదిలీ చేయాలని, లేకుంటే కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాలకు ఫిర్యాదు చేస్తామని, అవసరమైతే హైకోర్టుకు వెళతామని స్పష్టం చేశారు.బీజేపీ నాయకులు వరప్రసాద్, జీవన్, భాస్కర్, అజయ్‌కుమార్,శేఖర్,నాదముని తదితరులు పాల్గొన్నారు.



తిరుపతిని వైసీపీ నాయకులు గంజాయివనంగా మార్చేశారంటూ తులసిమొక్కను చూపుతున్న భానుప్రకాష్‌రెడ్డి



దొంగ ఓట్ల సూత్రధారులే మలికాను బదిలీ చేయించారు : టీడీపీ

తిరుపతి(తిలక్‌రోడ్), మార్చి 4 : తిరుపతి ఎంపీ ఉప ఎన్నికల్లో లాగా రాబోయే ఎన్నికల్లో అధికార పార్టీకి తొత్తులుగా ప్రభుత్వ అధికారులు వ్యవహరిస్తే తగిన మూల్యం చెల్లించకోకతప్పదని టీడీపీ పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహయాదవ్ హెచ్చరించారు.సోమవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవినాయుడితో కలిసి మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా నిర్ణయాలు తీసుకునే ఎస్పీ మలికా గార్గ్‌ను ఏ కారణం చేత వైసీపీ నేతలు బదిలీ చేయించారో చెప్పాలని డిమాండ్ చేశా రు.తిరుపతి పార్లమెంటు ఉప ఎన్నికల్లో దొంగ ఓట్ల కేసును తుదిదశకు తీసుకువచ్చే ప్రమాదం ఉందని గ్రహించిన అక్రమ ఓట్ల సూత్రధారులు సీఎంపై ఒత్తిడి తెచ్చి ఎస్పీని బదిలీ చేయించారని ఆరోపించారు. శ్రీకాళ హస్తి నియోజకవర్గంలో తమ పార్టీ నేతలపై అక్రమంగా రౌడీషీట్లు తెరవ డంపై ఎస్పీకి వినతిపత్రం ఇవ్వడంతో ఆమె అక్కడి అధికారులను ప్రశ్నిం చారన్నారు.ఇదంతా తెలిసి వచ్చే ఎన్నికల్లో ఎస్పీ సహకరించరని పసిగ ట్టిన వైసీపీ నాయకులు ఆమెను మార్చేశార న్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలని, లేనిప క్షంలో ఇబ్బందులు ఎదుర్కోక తప్పదన్నారు.టీ డీపీ నాయకులు కృష్ణయాదవ్, వాసు, సందీప్, రంజిత్, లోకేష్ బాబు తదితరులు పాల్గొన్నారు. విలేకరుల సమావేశం అనంతరం ఎస్పీ బదిలీకి వ్యతిరేకంగా ఎన్టీఆర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న తమ పార్టీ శ్రేణుల వద్దకు వెళతారేమోనన్న అనుమానంతో ప్రెస్‌క్లబ్ వద్దే వెస్ట్ పోలీసులు అరెస్టు చేసేందుకు ప్రయ త్నించగా నరసింహ యాదవ్, రవి నాయుడు తదితరులు రోడ్డుపై బైఠా యించారు.వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో వారిని అదుపులోకి తీసుకుని వెస్ట్ పోలీసుస్టేషన్‌కు తరలించారు. సీఆర్పీ 41ఎ కింద నోటీసులు ఇచ్చి పంపించారు.

నేడు ఎస్పీ బాధ్యతల స్వీకారం

తిరుపతి(నేరవిభాగం), మార్చి 4: తిరు పతి జిల్లా ఎస్పీగా కృష్ణకాంత్ పటేల్ మంగళవారం బాధ్యతలు తీసుకోను న్నారు.20రోజుల క్రితం జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన మలిక గర్గ్‌ను రాష్ట్రప్రభుత్వం ఆకస్మికంగా బదిలీచేసి సీఐడీ ఎస్పీగా నియమించింది. ఆ స్థానంలో ప్రస్తుతం విజయవాడ శాంతి భద్రతల విభాగం డీసీపీగా పనిచే స్తున్న కృష్ణకాంత్ పటేల్‌ను తిరుపతి జిల్లా ఎస్పీగా నియమించింది.కృష్ణ కాంత్ పటేల్ మంగళవారం ఉదయం 10-11 గంటల మధ్య బాధ్యతలు తీసుకోనున్నారు. వేకువనే జిల్లాకు చేరుకోనున్న ఆయన ముందుగా తిరు మలకు వెళ్లి శ్రీవారిని దర్శించుకున్న అనంతరం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయానికి చేరుకుని బాధ్యతలు తీసుకుంటారు.



ఎస్పీ కృష్ణకాంత్ పటేల్

మేం చెబితేనే మీకు పదవులొచ్చాయి

అసమ్మతి నాయకులపై మంత్రి రోజా భర్త సెల్వమణి వ్యాఖ్యలు

పుత్తూరు అర్బన్, మార్చి 4: 'మా సమ్మతితోనే మీకు పదవులు వచ్చాయి. మండలం మొత్తం వద్దన్నా వడమాలపేటకు చెందిన వైసీపీ నాయకుడు మురళీధర రెడ్డిని జడ్పీటీసీ చేశాం. చక్రపాణిరెడ్డికి శ్రీశైలం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ పదవికి లెటర్ ఇవ్వడంతో పాటు సీఎంవోలో కూడా చెప్పాం. నగరికి చెందిన కేజే కుమార్‌కు స్థానిక నాయకత్వానికి మధ్య కొంత అభిప్రాయబేధాలు ఉండడంతో ఆయనను రాష్ట్రస్థాయి పదవికి ఎంపిక చేయడంలో మా పాత్ర ఉంది' అని మంత్రి రోజా భర్త సెల్వమణి వ్యాఖ్యానించారు. ఆదివారం నగరిలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో మండల కమిటీల సన్మాన కార్యక్రమం సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేశారు. మంత్రి రోజా కూడా, ఏ రోజూ తాను వారి క్వారీ వ్యాపారాలకు అడ్డుపడలేదన్నారు.

తగ్గేదేలే!

శిలాఫలకాల తొలగింపుపై జిల్లా అధికారులకు జడ్పీటీసీ ఫిర్యాదు

వడమాలపేట, మార్చి 4:ప్రభుత్వ భవనాల ప్రారంభోత్సవం, శిలాఫలకాల తొలగింపు వ్యవహారంపై వడమాలపేట జడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, మంత్రి రోజా అసమ్మతి నాయకుడు జిల్లాస్థాయి అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వడమాలపేట మండలంలో గత ఆదివారం అప్పలాయగుంట, పత్తిపుత్తూరుల్లో పూర్తయిన సచివాలయ, ఆర్బీకే, పాలవెల్లువ భవనాలను నిబంధనల మేరకు ప్రోటోకాల్ జడ్పీటీసీ సభ్యుడిగా తాను ప్రారంభించినట్లు తెలిపారు. మంత్రి ఒత్తిడితో సంబంధిత పంచాయితీ రాజ్ శాఖ అధికారులు మూడు రోజుల తరువాత వాటిని తొలగించారన్నారు. ఈ అధికారులపై చర్యలు తీసుకోవాలని స్పందన కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశకు, ఏఎస్పీ కులశేఖర్‌కు, జడ్పీ సీఈవోకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. జడ్పీటీసీ సభ్యుడిగా తనకు సమాచారం లేకుండా మళ్లీ అదే భవనాలను ఆర్భాటంగా మంత్రి రోజా ప్రారంభించారని, ఈ విషయమై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరినట్లు తెలిపారు. అధికారులు చర్యలు తీసుకో కుంటే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తానని చెప్పారు.

టీడీపీ ముస్లిం మైనారిటీ రాష్ట్ర కమిటీలో జిల్లావాసులకు చోటు

తిరుపతి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ముస్లిం మైనా రిటీ రాష్ట్ర కమిటీలో తిరుపతి నియోజకవర్గానికి చెందిన మహబూబ్ బాషా రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నియమితు లయ్యారు. అలాగే వాణిజ్య విభాగం రాష్ట్ర కమిటీలో తిరుపతి నియోజకవర్గానికి చెందిన సీహెచ్ రామ్‌ప్రసాద్ ప్రధాన కార్య దర్శిగా, సత్యవేడు నియోజకవర్గానికి చెందిన కొండూరు బాల రాజు ఉపాధ్యక్షుడిగా, చంద్రగిరి నియోజకవర్గానికి చెందిన బిరుదాల భాస్కర్‌రెడ్డి, తిరుపతి నియోజకవర్గానికి చెందిన ఎం.జయకుమార్‌లు ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా నియమితుల య్యారు. ఈ మేరకు టీడీపీ అధినేత చంద్రబాబు ఆదేశాల మేరకు రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు మంగళవారం ఈ నియామకాలను ప్రకటించారు.

భూత వాహనంపై పార్వతీపరమేశ్వరుల దర్శనం



భూత వాహనంపై దర్శనమిస్తున్న పార్వతీపరమేశ్వరులు

చంద్రగిరి, మార్చి4: తొండవాడ అగస్త్యేశ్వరాలయంలో సోమవారం ఉదయం శేషవాహనం, రాత్రి భూత వాహనంపై పార్వతీపరమేశ్వరులు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామికి రుద్రాభిషేకం నిర్వహించి, ఆనందవల్లిదేవికి అభిషేకం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. 7.30 గంటలకు పార్వతీపరమేశ్వరుల ఉత్సవర్లు శేష వాహనంపై ఆలయ ప్రదక్షిణగా భక్తులకు దర్శనమిచ్చారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాత్రి 7 గంటలకు ఉత్సవర్లను భూత వాహనంపై ఊరేగించారు. ఆలయ ధర్మకర్త మొగిలి రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరిచెట్టు పైనుంచి పడి తిరుపతివాసి మృతి



మృతిచెందిన నారాయణరెడ్డి

పాకాల, మార్చి4: కొబ్బరిచెట్టుపై నుంచి ప్రమాదవశాత్తు జారిపడి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన పాకాల మండలం మొగరాల పంచాయతీ కృష్ణాపురం సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. కొబ్బరికాయలు వ్యాపారం చేస్తున్న తిరుపతి జగన్నాథపురానికి చెందిన బి.నారాయణరెడ్డి (56) కృష్ణాపురం సమీపంలో కొబ్బరికాయల కోసం చెట్టెక్కుతుండగా జారి కిందపడ్డాడు. చికిత్సకోసం దామలచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. ఐదారేళ్లుగా దామలచెరువులో కొబ్బరికాయల వ్యాపారం చేస్తున్నట్లు స్థానికులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పాకాల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సూపర్ సిక్స్ పథకాలతో రాష్ట్రాభివృద్ధి

టీడీపీ నేత పులివర్తి నాని



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేత పులివర్తి నాని

చంద్రగిరి, మార్చి4: టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో రాష్ట్రాభివృద్ధితో పాటు ప్రజాసంక్షేమం సాధ్యపడుతుందని చంద్రగిరి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పులివర్తి నాని అన్నారు. సోమవారం చంద్రగిరిలో టీడీపీ కస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జ్‌లతో పులివర్తి నాని ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలన్నారు. ప్రతి ఒక్కరూ టీడీపీ, జనసేన ప్రభుత్వం అధికారంలోకి వస్తే రాష్ట్రంలో చేపట్టనున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారం కోసమే అదాలత్



ప్రత్యేక విద్యుత్ లోక్ అదాలత్‌లో అధికారులు

చంద్రగిరి, మార్చి4: వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసమే విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఛైర్మన్, రిటైర్డు జడ్జి శ్రీనివాస ఆంజనేయమూర్తి తెలిపారు. సోమవారం చంద్రగిరిలోని విద్యుత్ సబ్‌డివిజన్ కార్యాలయంలో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహించారు. విద్యుత్ లైన్ల మరమ్మతులు, వ్యవసాయ మీటర్ల ఏర్పాటు, విద్యుత్ స్తంభాల మార్పు తదితర అంశాలపై ఫిర్యాదులొచ్చాయి. దీంతో కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కారం కోసం అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్థిక సభ్యులు రామమోహన్‌రావు, సాంకేతిక సభ్యులు అంజనీకుమార్, స్వతంత్ర సభ్యులు ఈశ్వరమ్మ, ఈఈ వాసురెడ్డి, ఏడీఈ శేషాద్రిరెడ్డి, ఏఈలు నాగరాజు, హరిప్రసాద్, వినియోగదారులు పాల్గొన్నారు.

పాల శీతలీకరణ కేంద్రం తనిఖీ



పాలశీతలీకరణ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

భాకరాపేట, మార్చి 4: జగనన్న పాలవెల్లువ పాల శీతలీకరణ కేంద్రాన్ని కలెక్టర్ లక్ష్మీశ సోమవారం సాయంత్రం తనిఖీ చేశారు. పాలశీతలీకరణ కేంద్రంలో చేపట్టాల్సిన మార్పులు, చేర్పులు సూచించారు. రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం పాల వెల్లువ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. చిన్నగొట్టిగల్లు మండలంలో 39 సెంటర్ల ద్వారా పాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీసీవో శ్రీనివాస్ రెడ్డి, ఏరియా రూట్ అధికారి రవిబాబు, ఎంపీడీవో దేవేంద్రబాబు, తహసీల్దారు నాగరాజు, ఏపీఎంలు కుమారస్వామి, హరినాథ్, ఏఈ రాజాజీ పాల్గొన్నారు.

'అగ్నివీర్' రిక్రూట్‌మెంట్ రిజిస్ట్రేషన్ ప్రారంభం

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 4: అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ 2024-25 కోసం రిజిస్ట్రేషన్ ప్రారంభమైందని సంబంధిత అధికారులు తెలిపారు. ఈనెల 22వ తేదీవరకు గడువిచ్చారు. అగ్నివీర్ జనరల్ డ్యూటీ, టెక్నికల్, ఆఫీస్ అసిస్టెంట్/స్టోర్‌కీపర్, టెక్నికల్, ట్రేడ్స్ మ్యాన్ తదితర పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు. వివరాలకు www.joinindianarmy.nic.in లో చూడవచ్చు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

రామచంద్రాపురం,మార్చి4:రామచంద్రాపురం మండలం నడవలూరు పంచాయతీకి చెందిన కుసుమకు ముఖ్యమంత్రి సహాయనిధి కింద రూ.65వేలు చెక్కును తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సోమవారం అందజేశారు.

వైభవంగా శివరాత్రి మహోత్సవాలు

తిరుచానూరు, మార్చి 4: తిరుచానూరులోని యోగిమల్లవరంలో కొలువైఉన్న కామాక్షాంబ సమేత పరాశరేశ్వరస్వామి ఆలయంలో 8వ తేదీ నుంచి మూడు రోజుల పాటు మహాశివరాత్రి ఉత్సవాలు జరగనున్నట్లు ఆలయ ఛైర్మన్ శ్రీధర్‌రెడ్డి సోమవారం తెలిపారు. భక్తులు ఉత్సవాల్లో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకోవాలని కోరారు.

నడికుడి - శ్రీకాళహస్తి రైల్వేలైను భూసేకరణ పనులు వేగవంతం

కలెక్టర్ లక్ష్మీశ

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 4: జిల్లాలో నడికుడి - శ్రీకాళహస్తి మధ్య రైల్వేలైనుకు సంబంధించి భూసేకరణ పనులు వేగవంతం చేసినట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. రైల్వే, జాతీయ రహదారులకు సంబంధించిన భూసేకరణ, పరిహారం పంపిణీ, బడ్జెట్ విడుదల పలు అంశాలపై న్యూఢిల్లీ నుంచి కేంద్ర అధికారులు వివిధ రాష్ట్రాల కార్యదర్శులు, కలెక్టర్లు, జేసీలు, జాతీయ రహదారుల అధికారులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. జిల్లా నుంచి కలెక్టర్ సంబంధిత అధికారులతో హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ వివరిస్తూ.. రైల్వే లైనుకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న సుమారు 182 ఎకరాల డీకేటీ భూములకు సంబంధించిన అవార్డు పాసింగ్ రానున్న జూన్‌కంతా పూర్తి చేస్తామన్నారు. కలెక్టరేట్ సిబ్బంది, భూసేకరణ డీటీ భాస్కర్ పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశానికి నోటిఫికేషన్

వెంకటగిరి, మార్చి 4: 2024- 2025 విద్యా సంవత్సరంలో రాష్ట్రంలోని 38 గురుకుల పాఠశాలల్లో 5,6,7,8 తరగతుల్లో మిగిలి ఉన్న సీట్లలో ప్రవేశానికి, 7 జూనియర్ బాలుర కళాశాలు, ఒక డిగ్రీ కళాశాలలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదలైనట్లు వెంకటగిరి గురుకుల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్, జిల్లా కోఆర్డినేటర్ చౌదరి శారదాబాయి తెలిపారు. అర్హత ఉన్న విద్యార్థులు హెచ్‌టిటిపిఎస్-ఎపిఆర్ఎస్.ఏపిసిఎఫ్ఎస్ఎస్.ఇన్ ద్వారా ఆన్‌లైన్‌లో ఈనెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. జిల్లాకు సంబంధించిన విద్యార్థులకు ఏప్రిల్ 25వ తేదీన తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ క్యాంపస్‌లో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. అదేవిధంగా రాష్ట్రంలోని 12 మైనారిటీ గురుకుల పాఠశాలల్లో 5,6,7,8 తరగతుల్లో మిగిలిన ఖాళీలకు ప్రవేశానికి, మూడు జూనియర్ బాలుర కళాశాలల్లో ప్రవేశానికి మైనారిటీ విద్యార్థులు మే 1 నుంచి సంబంధిత పాఠశాలల ప్రిన్సిపాళ్లను సంప్రదించి నేరుగా అడ్మిషన్ పొందవచ్చన్నారు.

మహిళా ఎస్పీకి బదిలీ బహుమానమా?: సీఐటీయూ

తిరుపతి(కొర్లగుంట), మార్చి 4: మరో నాలుగు రోజుల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకుంటున్న వేళ నీతి, నిజాయితీ కలిగిన మహిళా ఎస్పీ మలికా గర్గ్‌కు బదిలీని బహుమానంగా ఇచ్చిన వైసీపీ తీరు అభ్యంతరకరమైందని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి ఓ ప్రకటనలో తీవ్రంగా విమర్శించారు. పైగా తాము చెప్పిన తలూపలేదని, అధికార పార్టీ అక్రమాలకు చెక్ పెడుతుందన్న భయంతోనే ప్రభుత్వం ఈ బదిలీ చేసిందని పేర్కొన్నారు. దీన్ని బట్టి రానున్న ఎన్నికలు ఏ రకంగా జరుగుతాయో అర్థమవుతుందన్నారు.







వివిధ వేషధారణల్లో విద్యార్థులు - పట్టు వస్త్రాలందజేస్తున్న చెవిరెడ్డి భాస్కర రెడ్డి దంపతులు - లక్ష్మీకాసుల హారం ఊరేగింపు

వైభవంగా కల్యాణ వెంకన్న గరుడోత్సవం

నేడు స్వర్ణ రథోత్సవం

చంద్రగిరి మార్చి 4 : శ్రీనివాసమంగాపురం కల్యాణ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి గరుడోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారు మోహినీ అవతారంలో తిరుచ్చిపై నవనీత కృష్ణుడు రక్షణగా మాడ వీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు.తిరుమల శ్రీవారి ఆలయం నుంచి తీసుకొచ్చిన లక్ష్మీహారం శోభాయాత్రగా శ్రీనివాసమంగాపురానికి బుధవారం సాయంత్రం చేరుకుంది. ఈ హారాన్ని గరుడసేవలో అలంకరించారు.ఉదయం 6.30 గంటలకు తిరుపతిలోని గోవిందరాజుల స్వామి ఆలయం నుంచి ఆండాల్ అమ్మవారి మాలలను అంబారీపై తీసుకొచ్చారు. రాత్రి గరుడసేవలో స్వామి ఉత్సవమూర్తికి ఈ మాలలను అలంకరించారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర రెడ్డి దంపతులు తుమ్మలగుంట ఆలయం నుంచి మేల్ చాట్ వస్త్రాలను తీసుకొచ్చారు.రాత్రి 8 గంటలకు స్వామి ఉత్సవ మూర్తిని వాహన మండపానికి తీసుకొచ్చి పట్టు పీతాంబరాలు, బంగారు ఆభరణాలతో శోభాయమానంగా అలంకరించి గరుడ వాహనంపై ఊరేగించారు.టీటీడీ జీయంగార్లు,ఛైర్మన్ కరుణాకర రెడ్డి,జేఈవో వీరబ్రహ్మం,సీవీఆర్వో రవి, డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, కంకణ భట్టర్ శేషాచార్యులు, సూపరింటెండెంట్లు మునిచెంగల్రాయులు, వెంకటస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి, అర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.కాగా శ్రీనివాసమంగాపురంలో మంగళవారం సాయంత్రం స్వర్ణ రథోత్సవాన్ని నిర్వహించనున్నారు.





గరుడ వాహనంపై కల్యాణ వెంకన్న - హాజరైన భక్తజనం



మోహినీ అవతారంలో కల్యాణ వెంకన్న

శైవక్షేత్రాలకు 436 అదనపు ఆర్టీసీ బస్సులు

తిరుపతి(కొర్లగుంట), మార్చి 4: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శైవక్షేత్రాలకు 436 అదనపు ఆర్టీసీ బస్సులు నడపనున్నట్లు ప్రజారవాణాధికారి చెంగల్‌రెడ్డి తెలిపారు. డీపీటీవో కార్యాలయంలో ఆయన సోమవారం అధికారులతో సమీక్షించారు. శుక్రవారం శివరాత్రి పర్వదినం సందర్భంగా మూడ్రోజులపాటు జిల్లా పరిధిలో ఉన్న శ్రీకాళహస్తి, తలకోన, కైలాసకోన, సదాశికోన, మూలకోన, అవంతి, గుడిమల్లం, పంట్రంగం, యాకసిరి తిప్ప వంటి పుణ్యక్షేత్రాలకు భక్తుల సందడి అధికంగా ఉంటుందని తెలిపారు.

7,8,9 తేదీల్లో నడిచే సర్వీసులిలా..

తిరుపతి-తలకోన మధ్య 70, కోడూరు-తలకోన మధ్య 40, తిరుపతి-గుడిమల్లం మధ్య 7, శ్రీకాళహస్తి-తిరుపతి మధ్య 100, శ్రీకాళహస్తి-నాయుడుపేట మధ్య 8, శ్రీకాళహస్తి-పిచ్చాటూరు మధ్య 18, శ్రీకాళహస్తి వయా తడ,చెన్నై మధ్య 25, శ్రీకాళహస్తి-గుడిమల్లం మధ్య 4, పుత్తూరు-సదాశివకోన మధ్య 100, పూత్తూరు-కైలాసకోన మధ్య 8, పుత్తూరు-మూలకోన మధ్య 8, ఊత్తుకోట-సదాశివకోన మధ్య 17, వరదయ్యపాళెం-అవంతి మధ్య 8, కోట-పంట్రంగం మధ్య 6, నాయుడుపేట-పంట్రంగం మధ్య 6, నాయుడుపేట- యాకసిరితిప్ప మధ్య 5, గూడూరు-శ్రీకాళహస్తి మధ్య 6 మొత్తం 436 బస్సులను కేటాయించారు. ఇవి గురువారం ఉదయం నుంచి ప్రయాణికులకు అందుబాటులో ఉంటాయి.

అమ్మవారి సేవలో సమంత



తిరుచానూరు, మార్చి 4: తిరుచానూరులోని పద్మావతి అమ్మవారిని సోమవారం ప్రముఖ సినీ నటి సమంత దర్శించుకున్నారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం వెలుపల ఆమెతో సెల్ఫీలు తీసుకోవడానికి భక్తులు ఎగబడ్డారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ శేషగిరి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కమ్మకండ్రిగ హైస్కూల్లో వీడ్కోలు సమావేశం



జ్యోతి వెలిగిస్తున్న విద్యార్థులు

రామచంద్రాపురం, మార్చి 4: విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదిగితే వారి తల్లిదండ్రులకంటే ఉపాధ్యాయులే గర్విస్తారని సర్పంచ్ కావ్య వేణుగోపాల నాయుడు అన్నారు. మండలంలోని కమ్మకండ్రిగ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పదో తరగతితో పాఠశాలలో తొలి ర్యాంకు వచ్చిన విద్యార్థికి రూ.5వేలు, రెండవర్యాంకు విద్యార్థికి రూ.3వేలు, మూడవ ర్యాంకుకు రూ.వెయ్యి ఇవ్వనున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులు సరస్వతి పూజ నిర్వహించి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యాకమిటీ ఛైర్మన్ బాదూరు బాలయ్య, హెచ్‌ఎం వెంకట్రా మయ్య, ఉపాధ్యాయులు, శ్రీనివాసులుశెట్టి, దిలీప్, రాజశేఖర్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, ఉమామహేశ్వరి, జ్యోతి పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు తగిలి రైతు మృతి

కోట, మార్చి 4: మండల పరిధిలోని చెందోడులో విద్యుత్ తీగలు తగిలి మల్లి సోమయ్య(65) అనే రైతు ఆదివారం మృతి చెందారు. మండల పరిధిలోని ఊనుగుంటపాళెం గ్రామానికి చెందిన సోమయ్య చెందోడులో పొలాలను లీజుకు తీసుకొని వరి సాగు చేస్తున్నాడు. ఆదివారం వరి పంట కోసేందుకు కోత మిషన్ తీసుకెళ్తుండగా పైన విద్యుత్ తీగలు అడ్డు రావడంతో వాటిని తొలగించేందుకు ప్రయత్నించాడు. విద్యుత్ తీగలు రైతుపై పడటంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

తడ పోలీస్ స్టేషన్‌కు శిక్షణ ఎస్పీ



దేవరాజ్ మనీష్‌పాటిల్

తడ, మార్చి 4: తడ పోలీస్ స్టేషన్‌కు ట్రైనీ ఎస్పీని అధికారులు నియమించారు. పోలీస్ స్టేషన్ వ్యవహారాలు, నిర్వహణ వంటి విషయాలపై అవగాహన కోసం 2022 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన దేవరాజ్ మనీష్‌పాటిల్ ఇక్కడ నియమితులయ్యారని, ఆయన రెండు నెలలపాటు ఇక్కడ విధుల్లో ఉంటున్నట్లుగా స్థానిక పోలీసులు తెలిపారు. సోమవారం విధుల్లో చేరిన ట్రైనీ ఎస్పీ దేవరాజ్ మనీష్‌పాటిల్ రాష్ట్ర సరిహద్దులోని పన్నంగాడు, భీములవారిపాళెం వద్ద చెక్‌పోస్టును తనిఖీ చేశారు. ఆయన వెంట సూళ్లూరుపేట సీఐ మధుబాబు, ఎస్ఐ నరసింహరావు ఉన్నారు.

ఎన్నికలకు తమిళనాడు పోలీసులు సహకరించాలి

చిత్తూరు, మార్చి 4: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అక్రమ రవాణా అడ్డుకునేందుకు తమిళనాడు పోలీసులు సహరించాలని ఎస్ఈబీ ఏఎస్పీ సుబ్బరాజు కోరారు. సోమవారం చిత్తూరులో తమిళనాడు రాష్ట్రం వేలూరు సెబ్ ఏఎస్పీ భాస్కర్, అధికారులతో అంతర్రాష్ట్ర సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. రానున్న ఎన్నికలను పురస్కరించుకుని సరిహద్దు ప్రాంతాల వద్ద ఏర్పాటు చేసే చెక్‌పోస్టులు, వేలూరు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న నాన్ బెయిలబుల్ వారెంట్స్, అంతర్రాష్ట్ర నేరస్థులు, సారా రవాణాపై చర్చించారు. చిత్తూరుడీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి, గుడియాత్తండీఎస్పీ రవిచంద్రన్, కాట్పాడి డీఎస్పీ శ్రావణ్, వేలూరు ఎన్నికల సెల్ డీఎస్పీ ఇరుదిరాజ్ పాల్గొన్నారు.

ప్రజలను ఓటర్లుగా కాక మనుషులుగా చూడండి : నాని

● దామినేడులో చెత్తాచెదారం శుభ్రం చేసిన టీడీపీ నేతలు



వీధులను శుభ్రంచేస్తున్న పులివర్తి నాని

తిరుచానూరు, మార్చి 4: దామినేడు ఇందిరమ్మ గృహాల్లో ఉన్న ప్రజలను ఓటర్లుగా కాకుండా మనుషులుగా చూడాలని ఎమ్మెల్యే చెవిరెడ్డికి చంద్రగిరి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పులివర్తి నాని హితవు పలికారు. దామినేడు ఇందిరమ్మ గృహాల వద్ద సోమవారం ఆయన స్వయంగా పారిశుధ్య పనుల్లో పాలు పంచుకున్నారు. సొంత నిధులతో నాలుగు ఎక్స్‌కవేటర్లు, ట్రాక్టర్లు తీసుకొచ్చి దామినేడు పారిశుధ్యానికి శ్రీకారం చుట్టారు. టీడీపీ నాయకులతో కలిసి నాని స్వయంగా పలుగు, పార చేతబట్టి కాలువలోని వ్యర్థాలను, చెత్తాచెదారాన్ని శుభ్రం చేశారు. స్వయంగా బ్లీచింగ్ చల్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడచిని పదేళ్లుగా ఎమ్మెల్యేగా ఉన్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దామినేడును పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. ఈ హౌసింగ్ కాలనీలో 1,800 దొంగ ఓట్లు ఉన్నాయని ఆరోపించారు. దొంగ ఓట్లపై పెట్టిన శ్రద్ధ పారిశుధ్యంపై చూపించే ఉంటే బాగుండేదన్నారు. 2019లో ఓట్ల కోసం వచ్చిన ఎమ్మెల్యే ఆ తరువాత కనిపించలేదన్నారు. ఎమ్మెల్యేగా తనకు ఒక అవకాశం ఇస్తే దామినేడు రూపురేఖలు మారుస్తానని పులివర్తి నాని దామినేడు వాసులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఈశ్వర్‌రెడ్డి, అమిలినేని మధు, మధుశేఖర్, కిషోర్‌రెడ్డి, సల్మాన్‌రాజ్, శ్రీనివాసులు, మునిరత్నంరెడ్డి, వాసు, హరేరామ్, సాయిరాయల్, రాజేంద్ర, మార్కండేయులు, రామారావు, విజయలక్ష్మి, నాయక్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే భవిష్యత్తు : నాని



తిరుచానూరు, మార్చి 4: టీడీపీతోనే రాష్ట్రానికి భద్రత, భవిష్యత్తుకు గ్యారెంటీ ఉంటుందని టీడీపీ చంద్రగిరి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పులివర్తి నాని తెలిపారు. తిరుచానూరు పంచాయతీలో సోమవారం 'మీ ఇంటి వద్దకు మీ పులివర్తి నాని, బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. పింఛన్లు నిలిపివేయడం, రోడ్లు, డ్రైనేజీ సమస్యల గురించి స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని ఆయన భరోసా ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ సైకిల్ గుర్తుకు ఓటేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఈశ్వర్‌రెడ్డి, అమిలినేని మధు, మధుశేఖర్, కిషోర్‌రెడ్డి, సల్మాన్‌రాజ్, శ్రీనివాసులు, మునిరత్నంరెడ్డి, వాసు, హరేరామ్, సాయిరాయల్, రాజేంద్ర, మార్కండేయులు, రామారావు, విజయలక్ష్మి, నాయక్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సర్పంచ్‌నని బిల్లులు పెట్టడం లేదు

గ్రామస్తులతో కలిసి సర్పంచ్ ధర్నా



కేవీబీపురం, మార్చి4: టీడీపీ సర్పంచ్ అనే కారణంతో చేసిన పనులకు బిల్లులు పెట్టడం లేదని ఓళ్లూరు సర్పంచ్ సురేష్ వాపోయారు. సోమ వారం గ్రామస్తులతో కలిసి సచివాలయం వద్ద ఆయన ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో తాగునీటి బోరు వేయించి మోటర్లు బిగించామన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ పరిశీలించి ఎంబుక్‌లో బిల్లు పెట్టాలని ఆదేశించారని గుర్తుచేశారు. రెండేళ్లు గడిచినా కార్యదర్శి బిల్లు పెట్టకుండా ఇబ్బంది పెడుతున్నాడని విచారం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో బోరు పాడు కావడంతో మళ్లీ బాగుచేయించడానికి బిల్లు పెట్టాలని కోరితే పెట్టలేదని వాపోయారు. అడిగితే నాయకులతో ఇబ్బంది వస్తుందని కార్యదర్శి అంటున్నారని తెలియజేశారు. ఇదేసమయంలో తాగునీటి సమస్యపై గ్రామస్తులు నిలదీయడంతో ధర్నా చేయాల్సి వచ్చిందన్నారు. సమస్యను ఎంపీడీఓ శివప్రసాద్, ఈఓపీఆర్డీ దయసాగర్ దృష్టికి తీసుకెళ్లానని పేర్కొన్నారు.

● అట్టుంటనా!

వీరప్పన్‌కీ జై..!

'ఇదేందబ్బా ఇదా.. అడివి దొంగకు జై కొడతా వుండారు?' అని ఎవురికైనా డౌట్ కొట్టొచ్చు. తప్పు. అయప్ప అడివి దొంగకాదు, దేవుడు. అలా కొట్టడంలో తప్పు లేదు. మీరు అబద్ధమనుకుంటే ఈ కత ఓపిగ్గా ఇనాల. ఇయ్యాల రేపు.. నిజమైన వీరప్పన్ పాపం అడివిలోనే తిరిగి, ఆడనే చచ్చిపాయె. కానీ దీనబ్బడాల్లి.. ఆయప్ప తలను తన్నే వీరప్పన్‌లు ఇప్పుడు మనుషుల్లోనే శానామంది తిరగతా ఉండారు గదా. వీరప్పన్‌కు వీరాభిమనులు ఆంధ్రా-తమిళనాడు సరిహద్దుల్లో ఉన్న కుప్పం నియోజకవర్గంలోనే శానా ఊళ్లల్లోనే ఉండారు. అది వారి అబిమానం, మనం కాదనడానికి లేదు సామీ. ఇక్కడ అదికాదు కత. అట్టా ఒకూళ్లో ఆయనమీద అబిమానంతో కట్టుకున్న స్మారక దిమ్మకు రాజకీయ నాయకులు దిలాసాగా పూజలు చేసి ప్రారంబించేసినారంట. అదిగదా మీరిప్పుడు ఇనబోయే అసలు కత. ఆ ఊరు శాంతిపురం మండలంలో ఉండాది. ఆదోరంనాడు అధికార పార్టీవోల్లు రాజ్యాంగ పదవిలో ఉండే ఒక నాయకుడి నాయకత్వంలో ఆడికి పోలోమంటా ఎల్లిపాయిరి. ఈల్లు ఎల్లేకాడికి అక్కడ పార్టీ జెండాతో ఒక స్తూపం, దానిపక్కనే ఆ ఊళ్లో ఎక్కువమంది ఉండే కులపోల్ల జెండాతో ఇంకో స్తూపం ఉండాయి. పార్టీ జెండాతో ఉన్న స్తూపం మింద చచ్చిపొయ్యేదాకా ఒక జాతీయ పార్టీలో ఉండి, ముఖ్యమంత్రిత్వం కూడా చేసిన పెద్దాయన ఫోటోతోగూడా రాజ్యాంగ పదవిలోని నాయకుని నాయిన ఫోటో ఉండాది. ఎంత బాగా అరైన్ జేసినారు ఈ ఊళ్లో మన కులపోల్లు.. అని ఆ నాయకుడు సంబరపడిపోతా ఉండాడు. ఈలోగా 'అనా అనా అవక్క జూడనా..' అని అనుచరుడొకడు చెప్తే జూసి గతుక్కుమన్నాడాయప్ప. పార్టీ జెండా స్తూపం పక్కనే ఆయన కులపోల్లు ఇంకో దిమ్మెను కట్టేసి ఉండారు. అది గాదు.. ఆ దిమ్మమీద అడివిదొంగ వీరప్పన్ ఇంతేసి మీసాలతో దర్జాగా నిలబడి ఉన్న ఫోటో తాపడం చేసి ఉండాది. అంటే జాతీయ పార్టీలో జీవితాంతం గడిపిన దివంగత నాయకుడు, రాజ్యాంగ పదవిలోని నాయకుని తండ్రి ఫోటోల సరసన వీరప్పన్ ఫోటో ఉండాదన్నమాట దాదాపు. గతుక్కుమన్నాడు ఆ నాయకుడు అదిజూసి. మా దేవుడు వీరప్పన్, ఈయప్ప స్మారక స్తూపాన్ని గూడా ఆవిష్కరించి తీరాల్సిందేనంటా కులపోల్లు ఒకటే పోరు. ఇదేందప్పా.. ఈ పితలాటకం అని తలపట్టుకున్నాడంట. అయితే ఆయప్పతోపాటు ఉండిన మండల నాయకుడు మాత్రం ఆ నాయకుడిని చేయిపట్టి తీసుకోనెల్లి... ఆ ఊరి సొంత కులపోల్లు డిమాండ్ జేసినట్లు వీరప్పన్‌కు సైతం పూజలు చేయించి, ఆ స్మారక స్తూపాన్ని ఆయన చేతులమీదుగా ఆవిష్కరింపజేసేసినాడు. వీరప్పన్ దేవుడంటూ ఆ మండల నాయకుడు స్పీచ్ ఇస్తావుంటే ఇంటా ఉండిపొయ్యినాడు. చివరాకరుకు వీరప్పన్‌కు జై అంటా నినాదాలు గూడా చేసినాక గానీ ఆ ఊరి సొంత కులపోల్లు ఇడిసిపెట్టలేదంట ఆ నాయకుడిని. అసలే ఎలక్షన్లు మీదపడిపోతా వుండాయి. కాదంటే ఏం తంటా వస్తాదోనని వీరప్పన్‌కు జై కొట్టేసి గమ్మున ఎనక్కు తిరిగి వొచ్చేసినాడాయప్ప. ఆదోరం మొత్తం సోషల్ మీడియాలో ఈ ఫోటోలు తెగ చక్కర్లు కొట్టినాయి. వాటితోపాటు వీరప్పన్ దివ్యత్వాన్ని పొగుడుతూ భక్తులు రాసిన రాతలు గూడా పారవశ్యాన్ని కలిగించినాయి. సోమారంనాడు పద్దన లేచి జూసేతాలికి ఒక్కటంటే ఒక్క ఫోటో కనిపించలేదంటే నమ్మాలి మీరు. 'దేవుడు' వీరప్పన్ స్తూపాన్ని ఆవిష్కరించినందుకు సిగ్గుపడినారో ఏందో నాయకులు తెలీదు. 'అయినా, ఇందులో సిగ్గుపడేదానికి ఏముండాదప్పా... మనోల్లలో శానామందికి వీరప్పన్ ఆశయాలు ఉండేది నిజమే గదా..' అని ఆ పార్టీ కార్యకర్తలు ఆశ్చర్యపోతా ఉండారంట.

- కుప్పం



వీరప్పన్ ఫొటోతో ఉన్న స్మారక స్తూపం

తిరుపతి

కర్ణాటక కొత్త సత్రాల్లో వాస్తు హోమం



తిరుమల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో నూతనంగా నిర్మిస్తున్న కర్ణాటక సత్రాల్లో సోమవారం వాస్తు హోమం నిర్వహించారు. శ్రీవారి ఆలయం వెనుక భాగంలోని స్థలంలో కర్ణాటక ప్రభుత్వం సత్రాలను నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ఈనిర్మాణం దాదాపుగా పూర్తయిన క్రమంలో ఆ రాష్ట్ర మంత్రి రామలింగారెడ్డి, ఎండోమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ రాజేంద్రకుమార్ కటారియా, కమిషనర్ బసవరాజేంద్ర ఇతర అధికారులు కలిసి సోమవారం మధ్యాహ్నం వాస్తు హోమాన్ని నిర్వహించారు. కర్ణాటక ప్రభుత్వం 2021 డిసెంబరు 27న రూ.220 కోట్ల వ్యయంతో కర్ణాటక సత్రాల అభివృద్ధి కోసం తిరుమలలోని స్థలాన్ని టీటీడీకి అప్పగించిన విషయం తెలిసిందే. ఈ నిర్మాణం ప్రస్తుతం దాదాపు పూర్తయింది. ఇందులో మొత్తం 242 గదులతో రెండు బ్లాకులు, 12 డార్మిటరీలు, ఒక కల్యాణమండపం, ఒక సూట్ బ్లాక్, 86 గదులతో కూడి పాత బ్లాక్ ఉన్నాయి. మరో మూడు నాలుగు నెలల్లో ఈసత్రాలను అధికారికంగా ప్రారంభించనున్నారు.

జారవిడుచుకున్న సెల్‌ఫోన్ తిరిగి అప్పగింత



భక్తులకు సెల్‌ఫోన్ అప్పగిస్తున్న అధికారులు

తిరుమల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చి తమ సెల్‌ఫోన్ జారవిడుచుకున్న భక్తులకు అధికారులు తిరిగి అప్పగించారు. హరియాణాకు చెందిన నాచూర్ భక్తి అనే భక్తుడు స్వామి దర్శనం కోసం సోమవారం తిరుమలకు వచ్చాడు. అన్నప్రసాదాలు స్వీకరించేందుకు ఉదయం 11.40 గంటలకు తిరుమలలోని అన్నప్రసాద భవనానికి చేరుకున్నారు. అన్నప్రసాదాలు స్వీకరించే సమయంలో రూ.1.20 లక్షల విలువైన సెల్‌ఫోన్ మరిచిపోయి వెళ్లిపోయాడు. గుర్తించిన సిబ్బంది దాన్ని అధికారులకు అందజేశారు. కొంత సమయానికి సెల్‌ఫోన్ పోయిందంటూ నాచూర్ భక్తి వచ్చాడు. అన్నప్రసాదం అధికారులు వెంకటరమణ, తిమ్మప్ప, తులసి, రత్నప్రభాకర్‌లు వివరాలు తెలుసుకుని అతడిని సెల్‌ఫోన్‌ని అప్పగించారు. అధికారులకు ఆ భక్తుడు కృతజ్ఞతలు తెలిపాడు.

ఆటోడ్రైవర్ అనుమానాస్పద స్థితిలో మృతి



బాబు మృతదేహం

తిరుపతి(నేరవిభాగం), మార్చి 4: ఓ ఆటోడ్రైవర్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. తిరుపతి రూరల్ ఎస్ఐ షేక్షావలి తెలిపిన వివరాల ప్రకారం.. కర్నూలు జిల్లా పత్తికొండ తాలూకా దూదేకొండకు చెందిన పుర్రా బాబు (34) బతుకుతెరువుకోసం ఆరేళ్ల కిందట కుటుంబంతో కలిసి తిరుపతికి వచ్చాడు. తిరుపతి రూరల్ అవిలాలలో నివాసం ఉంటున్నాడు. నగరంలో ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిసవడంతో సంపాదించినదంతా తాగుడికే ఖర్చుపెట్టేవాడు. కొంతకాలంగా టీబీవ్యాధితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం మార్కెట్‌యార్డు వద్ద తన ఆటోలోనే మృతిచెంది కనిపించాడు. స్థానికుల సమాచారంతో పోలీసులొచ్చి పరిశీలించి కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. పూటుగా మద్యం తాగినట్లు గుర్తించామని, అయితే ఎలా చనిపోయాడన్నది పోస్టుమార్టం నివేదిక వచ్చాక తెలుస్తుందని ఎస్ఐ తెలిపారు.

ప్రైవేట్ స్కూల్స్‌లో 1వ తరగతిలో ఉచిత ప్రవేశాలకు దరఖాస్తులు

- నేటినుంచి 25వ తేదీవరకు గడువు: డీఈవో

తిరుపతి(విద్య), మార్చి 4: రాష్ట్రంలోని ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈమేరకు డీఈవో డాక్టర్ వి.శేఖర్ పేర్కొన్నారు. మంగళవారం నుంచి ఈనెల 25వ తేదీవరకు అర్హులైన విద్యార్థుల తల్లిదండ్రులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలని కోరారు. ఎస్సీలకు 10శాతం, ఎస్టీలకు 4, అనాథపిల్లలు, హెచ్ఐవీ బాధిత, దివ్యాంగులకు 5, బలహీనవర్గాలకు(బీసీ, మైనార్టీ, ఓసీ) 6శాతం చొప్పున మొత్తం 25శాతం సీట్లను కేటాయిస్తామని వివరించారు. 2018 ఏప్రిల్ 2 నుంచి 2019 మార్చి మధ్యలో జన్మించిన వారు అర్హులన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నివసించే బలహీన వర్గాల కుటుంబ వార్షిక ఆదాయం రూ.లక్షా 20వేలు, పట్టణ ప్రాంతాల వారికైతే రూ.లక్షా 40వేలు ఉండాలని సూచించారు. సమీపంలోని సచివాలయ కేంద్రం లేదా ఎంఈవో కార్యాలయం నుంచి పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేయాలన్నారు. ఇతర వివరాలకు ఎంఈవో, డీవైఈవో కార్యాలయాలు, సాంకేతిక సమస్యల పరిష్కారానికి టోల్‌ఫ్రీ నెంబరు 14417ని సంప్రదించాలని వివరించారు.

సుగుణమ్మకు కాకుండా వేరొకరికి టికెట్ ఇస్తే ఓటమి తథ్యం


- టీడీపీ నాయకురాలు బ్యాంకు శాంతమ్మ



మీడియాతో మాట్లాడుతున్న బ్యాంకు శాంతమ్మ

తిరుపతి(తిలక్‌రోడ్), మార్చి 4: తిరుపతి ఎమ్మెల్యే టికెట్‌ని సుగుణమ్మకు కాకుండా వేరొకరికి ఇస్తే ఓటమి తథ్యమని టీడీపీ నాయకురాలు బ్యాంకు శాంతమ్మ స్పష్టం చేశారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. రాజకీయ నాయకులు తిరుపతికి వచ్చి తిరుమలలోని శ్రీవారిని దర్శించుకుని కోరికలు కోరుకుని వెళ్లండి.. అంతేకానీ తిరుపతి ఎమ్మెల్యే టికెట్ అడగవద్దని చెప్పారు. మాజీ సీఎం చంద్రబాబుతో సమానంగా ఓట్లు సాధించిన మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మకు తిరుపతి ఎమ్మెల్యే టికెట్ ఇవ్వడంపై అధిష్ఠానం ఎందుకు ఆలోచిస్తుందో అర్థం కావడంలేదన్నారు. బలిజ సామాజికవర్గం ప్రాతినిధ్యం ఉన్న నియోజకవర్గంలో వేరే ప్రాంతాలకు చెందిన వ్యక్తులకు టికెట్ ఇవ్వడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఇక ఎన్నికల సమయంలో ఎస్పీని మార్చడం దారుణమన్నారు. ఈ అంశంపై ఆందోళన చేస్తున్న సుగుణమ్మను అరెస్టు చేయడం సరికాదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో రేవతి, అనిత, లత, సుబ్బు పాల్గొన్నారు.

హోరాహోరీగా టీటీడీ వార్షిక క్రీడలు



కబడ్డీ పోటీల్లో తలపడుతున్న టీటీడీ ఉద్యోగులు

తిరుపతి(కొర్లగుంట), మార్చి 4: టీటీడీ వార్షిక క్రీడల్లో భాగంగా సోమవారం జరిగిన కబడ్డీ పోటీల్లో తులసీ ధామరెడ్డి జట్టుపై చిరంజీవి జట్టు విజేతగా నిలిచింది. సీనియర్ అధికారుల బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో వెంకటస్వామి జట్టుపై సురేంద్ర జట్టు, మహిళా విభాగంలో పాసింగ్ ది లగేజ్ పోటీలో అనురాధ జట్టుపై మునిలత జట్టు గెలుపొందాయి. క్యారమ్స్ సింగిల్స్‌లో వసుధపై రాజేశ్వరి, డబుల్స్‌లో మల్లీశ్వరి-విజయ జట్టుపై రాధిక-శశికళ జట్టు విజేతగా నిలిచింది.

వైసీపీ లీగల్‌సెల్ రాష్ట్ర కార్యదర్శిగా చంద్రశేఖర్‌రెడ్డి



తిరుపతి(లీగల్), మార్చి 4: వైసీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా తిరుపతికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డిని నియమించారు. ఈయన మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాదిగా, వార్డు అధ్యక్షుడిగా, లీగల్‌సెల్ తిరుపతి అధ్యక్షుడిగా సేవలందించారు. తనకీ పదవి రావడానికి కృషిచేసిన ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డిలకు చంద్రశేఖర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు.

ఇంటర్ ఫస్టియర్ పరీక్షలకు 841మంది గైర్హాజరు

తిరుపతి(విద్య),మార్చి4: ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర పబ్లిక్ పరీక్షలకు సోమవారం 841మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆర్ఐవో జీవీ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. 87 కేంద్రాల్లో జరిగిన ఈ పరీక్షలకు జనరల్, ఒకేషనల్ విభాగంలో 33,480 మంది విద్యార్థులకుగాను 32,639 మంది హాజరయ్యారు. జనరల్ విభాగంలో 31,974 మందికిగాను 31,258 మంది హాజరవగా, 716మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 1506 మందికిగాను 1381 మంది హాజరవగా, 125 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆర్ఐవో వివరించారు. డీఈసీ, ఫ్లైయింగ్, సిట్టింగ్ స్క్వాడ్‌లు పరీక్షలను పర్యవేక్షించాయి.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.20 కోట్లు

తిరుమల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వర స్వామి హుండీ ఆదాయం రూ.4.20 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను ఆదివారం పరకామణి లెక్కింపులు నిర్వహించారు. ఈమేరకు ఆదాయం లభించినట్టు సోమవారం ఉదయం టీటీడీ ప్రకటించింది. ఇక, ఆదివారం 76,876 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 23,424 మంది తలనీలాలు సమర్పించారు.

25న తుంబుర తీర్థ ముక్కోటి

తిరుమల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): తుంబుర తీర్థ ముక్కోటి ఉత్సవం ఈనెల 25వ తేదీన జరగనుంది. పురాణప్రాశస్త్యం ప్రకారం తిరుమలలోని శేషగిరుల్లో 3 కోట్ల 50 లక్షల పుణ్యతీర్థాలు ఉన్నాయని ప్రతీతి. ఈ తీర్థాల్లో ధర్మ, జ్ఞాన, భక్తి, వైరాగ్య, ముక్తిప్రదాలు కలిగించేవి 7 తీర్థాలు. అవి స్వామి పుష్కరిణి, కుమారధార, తుంబుర, రామకృష్ణ, ఆకాశగంగ, పాపవినాశనం, పాండవ తీర్థాలు. ఈతీర్థాల్లో ఆయా పుణ్య ఘడియల్లో స్నానమాచరిస్తే సర్వపాపాలు తొలగి ముక్తి సమకూరుతుందని పురాణ వైశిష్ట్యం. ఇందులో భాగంగా ఫాల్గుణ మాసంలో ఉత్తరఫల్గుణీ నక్షత్రంతో కూడిన పౌర్ణమిరోజున తుంబుర తీర్థ ముక్కోటిని నిర్వహించడం టీటీడీకి ఆనవాయితీగా వస్తోంది. ప్రకృతి సౌందర్యాల నడుమ తుంబుర తీర్థ ముక్కోటిని దర్శించి, స్నానమాచరించడం ఒక ప్రత్యేక అనుభూతిగా భక్తులు భావిస్తారు.

శ్రీశైల మల్లన్నకు శ్రీవారి పట్టువస్త్రాలు



పట్టువస్త్రాలు తీసుకెళుతున్న టీటీడీ ఈవో ధర్మారెడ్డి

తిరుమల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలంలో భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి తరపున టీటీడీ ఈవో ధర్మారెడ్డి సోమవారం సాయంత్రం పట్టువస్త్రాలు సమర్పించారు. శ్రీశైలంలో జరిగే శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా టీటీడీ తరపున పట్టువస్త్రాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ఆలయం వద్దకు చేరుకున్న ఈవోకు మల్లన్న ఆలయ చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, ఈవో పెద్దిరాజు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈకార్యక్రమంలో తిరుమల శ్రీవారి ఆలయ పారుపత్తేదారు తులసీప్రసాద్ పాల్గొన్నారు.

నోడల్ అధికారులతో డీఆర్వో సమీక్ష

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 4: రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నోడల్ అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని డీఆర్వో పెంచలకిషోర్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో సార్వత్రిక ఎన్నికల విధులను కేటాయించిన నోడల్ అధికారులతో సమీక్షించారు. ఎన్నికల సూపరింటెండెంట్ చంద్రశేఖర్, డీటీ గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

షరా మామూలే..!

- కలెక్టరేట్‌కు పోటెత్తిన బాధితులు
- 'స్పందన'కు వచ్చిన అర్జీలు 167



అర్జీదారుడి సమస్యను తెలుసుకుంటున్న కలెక్టర్ లక్ష్మీశ

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 4: తమ సమస్యలు పరిష్కరించాలని ఎప్పటిలాగే బాధితులు కలెక్టరేట్‌కు పోటెత్తారు. సోమవారం జరిగిన స్పందన కార్యక్రమానికి 167 అర్జీలు అందాయి. వీటిల్లో అత్యధికంగా 133 అర్జీలు భూ సమస్యలపైనే ఉన్నాయి. బాధితుల నుంచి అర్జీలను కలెక్టర్ లక్ష్మీశతోపాటు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు మురళి, భాస్కర్‌నాయుడు, చంద్రశేఖర్‌నాయుడు, దేవేంద్రరెడ్డి స్వీకరించారు. స్పందనకు వచ్చిన అర్జీలకు అధిక ప్రాధాన్యమివ్వాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

శ్మశాన స్థలం కోసం తిరుగుతూనే ఉన్నాం



మా కాలనీలో ఎవరైనా చనిపోతే శ్మశాన స్థలం లేక ఇబ్బంది పడుతున్నాం. ప్రస్తుతం కలుజు పరిసరాల్లో దహన క్రియలు నిర్వహిస్తున్నాం. శ్మశాన స్థలం కేటాయించి, రోడ్డు ఏర్పాటు చేయాలని అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నాం. ఇకనైనా మా సమస్య పరిష్కరించండి.

- వెంకటేశ్వర్లు, వర్ధనపల్లి ఎస్టీకాలనీ, వెంకటగిరి మండలం

సాగునీటి కాలువను కబ్జా చేశారు



మా మండలంలోని పత్తిపుత్తూరులో సాగునీటి కాలువను కొంతమంది ఎక్స్‌కవేటర్లతో పూడ్చివేస్తున్నారు. రైతులకు ఉపయోగపడే కాలువను పూడ్చివేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకోండి.

- చెంగల్రాయులు, చింతకాల్వ, వడమాలపేట మండలం

పెండింగ్ జీతాలు చెల్లించండి



గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న స్వచ్ఛభారత్ కార్మికులకు దాదాపు రెండేళ్లుగా జీతాలు ఇవ్వడం లేదు. వీరి సమస్యను ఇకనైనా పరిష్కరించండి.

- డీపీవో రాజశేఖర్‌రెడ్డికి కార్మికులతో కలిసి వినతిపత్రమిచ్చిన ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, సహాయ కార్యదర్శి శివకుమార్, స్వచ్ఛభారత్ జిల్లా కార్యదర్శి అన్నాదురై

సదరం సర్టిఫికెట్ ఇప్పించండి



నాకు ఎడమకాలు పనిచేయదు. ఒక కన్ను దృష్టిలోపం ఉంది. అలాగే బ్రెయిన్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నా. సదరం సర్టిఫికెట్ 80శాతం ఇవ్వాలని తిరుగుతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదు. మీరైనా విచారించి సర్టిఫికెట్ ఇప్పించండి

- దేవేంద్ర, అప్పలాయగుంట, వడమాలపేట మండలం

పోలీసు 'స్పందన'కు 70 అర్జీలు



బాధితులతో మాట్లాడుతున్న ఏఎస్పీలు వెంకట్రావు, కులశేఖర్

తిరుపతి(నేరవిభాగం), మార్చి 4: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 70 అర్జీలు అందాయి. జిల్లా పరిపాలనా విభాగం అదనపు ఎస్పీ వెంకట్రావు, శాంతి భద్రతల విభాగం అదనపు ఎస్పీ కులశేఖర్, నేర విభాగపు అదనపు ఎస్పీ విమల కుమారి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాలనుంచి ప్రజలు వచ్చి తమ సమస్యలను తెలియజేసి, పరిష్కరించాలని కోరారు. ఏఎస్పీలు సంబంధిత పోలీసు స్టేషన్ల అధికారులతో మాట్లాడి సమస్యలను సత్వరం పరిష్కరించాలని ఆదేశించారు.

వాహనం ఢీకొని వలస కూలీ దుర్మరణం

తిరుపతి(నేరవిభాగం), మార్చి 4: వాహనం ఢీకొని ఒడిసా రాష్ట్రానికి చెందిన ఓ వలస కూలీ దుర్మరణం చెందాడు. తిరుపతి రూరల్ ఏఎస్ఐ జోగారావు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిసాకు చెందిన గౌరవ్ జానీ (35) తిరుపతిలో కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి సుమారు 1.30 గంటల సమయంలో ఆర్సీపురం వైపునుంచి తిరుపతి వైపునకు రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. తలకు బలమైన గాయాలవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి సెల్‌ఫోన్‌ద్వారా కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. గౌరవ్ సోదరుడు తిరుపతికి వస్తున్నారని, ఆయన వచ్చాక ఫిర్యాదు తీసుకుని కేసు నమోదు చేస్తామని ఏఎస్ఐ తెలిపారు.

మకర, శేషవాహనాలపై కపిలేశ్వరుడి విహారం





తిరుపతి (కల్చరల్), మార్చి 4: కపిలేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం ఏడు నుంచి తొమ్మిది గంటల వరకు కామాక్షి సమేత సోమస్కంద మూర్తి మకర వాహనంపై విహరించారు. ఊరేగింపు భజనలు, కోలాటాలు, మంగళవాయిద్యాల నడుమ కపిలతీర్థం నుంచి అన్నారావు కూడలి, వినాయక నగర్ క్వార్టర్స్, ఎన్‌జీవో కాలనీ, అలిపిరి బైపాస్ రోడ్డు మీదుగా తిరిగి కపిలతీర్థం చేరుకుంది. దారిపొడవునా భక్తులు స్వామివారికి కర్పూరనీరాజనాలు పట్టారు. అనంతరం ఆలయంలో సోమస్కందస్వామి, కామాక్షి అమ్మవార్లకు అర్చకులు స్నపన తిరుమంజనం నిర్వహించారు. మధ్యాహ్నం మూడు నుంచి 3.30 గంటల వరకు స్వామి వారికి అభిషేక సేవ జరిగింది. సాయంత్రం ఆరు గంటల నుంచి విశేష దీపారాధన జరిగింది. రాత్రి ఏడు నుంచి తొమ్మిది గంటల వరకు స్వామి అమ్మవార్లు శేష(నాగ) వాహనంపై పురవీధుల్లో విహరించారు. ఆలయ డిప్యూటీ ఈవో దేవేంద్ర బాబు, ఏఈవో సుబ్బరాజు, సూపరింటెండెంట్ భూపతి, ఆలయ అర్చకులు, సిబ్బంది, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయంలో జరిగిన శ్రీవేంకటేశ్వర సంగీత నృత్య కళాశాల, నాదస్వర డోలు పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన వేణువు, గాత్ర సంగీత కార్యక్రమాలు, నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

నేటి కార్యక్రమాలిలా..

మంగళవారం ఉదయం ఏడు నుంచి తొమ్మిది గంటల వరకు తిరుచ్చి ఉత్సవం జరుగుతుంది. రాత్రి ఏడు నుంచి తొమ్మిది గంటల వరకు అధికార నంది వాహనసేవ జరుగుతుంది.

పూర్వ విద్యార్థుల కలయిక



తిరుపతి(విద్య), మార్చి 4: ఎస్వీజేఎస్ఎం స్కూల్‌లో 1975-76 బ్యాచ్‌లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు సోమవారం కలుసుకున్నారు. పాఠశాల హెచ్ఎం, టీచర్ల కోరిక మేరకు బీరువా, ఫుట్‌బాల్, వాలీబాల్ క్రీడా సామగ్రిని వితరణ చేశారు. అలాగే తమ పూర్వ విద్యార్థుల సంఘం తరపున ఈనెలలో జరిగే టెన్త్ పబ్లిక్ పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థులకు ప్యాడ్స్, పెన్నులతోపాటు విద్య, క్రీడా, సాంస్కృతిక విభాగాల్లో ప్రతిభచాటిన 100మంది విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించినట్లు ప్రకటించారు. సంఘ నాయకులు భార్గవ, విజయపణిబాబు, మోహన్, సోము, రవి మాట్లాడుతూ 2014లో ఏర్పడిన తమ సంఘ పదో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాల అభివృద్ధికి తమవంతు సాయం చేశామని చెప్పారు. తిరుపతితోపాటు హైదరాబాద్, బెంగళూరు ప్రాంతాలనుంచి పలువురు పూర్వవిద్యార్థులు హాజరయ్యారు.

కరాటే పోటీల్లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ



తిరుపతి (కొర్లగుంట), మార్చి 4: తమిళనాడులో ఆదివారం జరిగిన 27వ సౌత్ఇండియా ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా చెందిన ఆరుగురు క్రీడాకారులు కటాలో చాంపియన్‌షిప్, కుమితే ప్రథమ స్థానం కైవసం చేసుకున్నారు. ప్రతిభ చూపిన ఈ.హిమాన్షు, పి.కీర్తి కశెట్టి, కీర్తన్‌శెట్టి, పి.కుందన, పి.హేమకీర్తన్, పి.సాయిసంతోష్‌లను మాస్టర్ శేఖర్ అభినందించారు.

మాజీ ఉపరాష్ట్రపతి నేడు తిరుపతి రాక

తిరుపతి(కొర్లగుంట), మార్చి 4: రాష్ట్రీయ సేవా సమితి (రాస్) ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం తిరుపతిలోని పీఎల్ఆర్ కన్వెన్షన్‌లో ముందస్తు అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరగనుంది. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా హాజరయ్యేందుకు మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు తిరుపతికి వస్తున్నారు. అలాగే స్థానిక రాజకీయ ప్రముఖులు పాల్గొననున్నారు. రాస్ లబ్ధిదారులు, మహిళా సంఘాల సభ్యులు, సిబ్బంది, రాస్ జనరల్‌బాడీ, కార్యనిర్వాహక సభ్యులు పాల్గొనాలని రాస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.వెంకటరత్నం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

తిరుమలేశుడి సేవలో ప్రముఖులు



నాగమహేష్ - రమ్యశ్రీ

తిరుమల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వీరిలో.. కర్ణాటక మంత్రి రామలింగారెడ్డి, కర్ణాటక ఎండోమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ రాజేంద్రకుమార్ కటారియా, నటులు నాగ మహేష్, రమ్యశ్రీ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

స్వామి ఆశీస్సులు ఇస్తే రాజకీయాల్లోకి వెళతా: రమ్యశ్రీ

'ఓ మల్లి' వంటి చిత్రంతోపాటు అనేక పాత్రల్లో నటించిన నేను ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో గతంలో రాజకీయాల్లోకి ప్రవేశించా. మళ్లీ స్వామి ఆశీస్సులు ఇస్తే రాజకీయాల్లోకి వెళతా' అని సినీ నటి రమ్యశ్రీ అన్నారు. దర్శనానంతరం ఆమె ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. స్వామి అనుగ్రహం ఉంటేనే దర్శనం లభిస్తుందన్నారు. దాదాపు రెండేళ్ల తర్వాత స్వామి దర్శనం దక్కడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు.

ఇద్దరు 'ఎర్ర' స్మగ్లర్ల అరెస్టు

28 దుంగలు, లగేజీవ్యాను, బైక్ స్వాధీనం





స్వాధీనం చేసుకున్న దుంగలు - పట్టుబడ్డ ఎర్రచందనం స్మగ్లర్లు

తిరుపతి అర్బన్, మార్చి 4: అన్నమయ్య జిల్లా సురభి ఫారెస్టు బీటు పరిధిలో ఇద్దరు ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేశారు. 28 ఎర్రచందనం దుంగలతోపాటు లగేజీ వ్యాను, బైక్‌ను టాస్క్‌ఫోర్సు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ ఆదేశాలతో డీఎస్పీ చెంచుబాబు ఆధ్వర్యంలో రైల్వే కోడూరు సబ్ డివిజన్ ఆర్ఐ కృపానందానికి చెందిన ఆర్ఎస్ఐ రాఘవేంద్ర బృందం ఆదివారం రాత్రి అన్నమయ్య జిల్లా గాలివీడు మండలం గువ్వల చెరువు సెక్షన్‌లో కూబింగ్ చేపట్టారు. సోమవరం తెల్లవారుజామున సురభి ఫారెస్టు బీటుపరిధిలోని హిందుకూరవాండ్లపల్లి-తూముకుంట మెయిన్‌రోడ్డుపై వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో అక్కడికి చేరుకున్న లగేజీ వ్యానులోనివారు, పైలట్‌గా వస్తున్న బైక్‌పై ఉన్న వ్యక్తి టాస్క్‌ఫోర్సు సిబ్బందిని చూసి వాహనాలను తిప్పుకుని వెళ్లే ప్రయత్నం చేశారు. టాస్క్‌ఫోర్సు పోలీసులు వెంటపడటంతో వాహనాలను వదలి పారిపోతుండగా ఇద్దరిని పట్టుకున్నారు. వీరిని గాలివీడు మండలానికి చెందిన పచ్చిపాల యోగీశ్వరనాయుడు(33), ఇర్రి పెద్దినాయుడిగా గుర్తించారు. లగేజీవాహనాన్ని పరిశీలించగా 28 ఎర్రచందనం దుంగలు బయటపడ్డాయి. దాంతో దుంగలు, రెండు వాహనాలనుస్వాధీనం చేసుకున్నారు. కేసును తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్ స్టేషన్‌లో నమోదు చేశారు. సీఐ శ్రీనివాసులు దర్యాప్తు చేస్తున్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

గురుకులాల్లో ప్రవేశానికి నోటిఫికేషన్

వెంకటగిరి, మార్చి 4: 2024- 2025 విద్యా సంవత్సరంలో రాష్ట్రంలోని 38 గురుకుల పాఠశాలల్లో 5,6,7,8 తరగతుల్లో మిగిలి ఉన్న సీట్లలో ప్రవేశానికి, 7 జూనియర్ బాలుర కళాశాలు, ఒక డిగ్రీ కళాశాలలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదలైనట్లు వెంకటగిరి గురుకుల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్, జిల్లా కోఆర్డినేటర్ చౌదరి శారదాబాయి తెలిపారు. అర్హత ఉన్న విద్యార్థులు హెచ్‌టిటిపిఎస్-ఎపిఆర్ఎస్.ఏపిసిఎఫ్ఎస్ఎస్.ఇన్ ద్వారా ఆన్‌లైన్‌లో ఈ నెల 31వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. జిల్లాకు సంబంధించిన విద్యార్థులకు ఏప్రిల్ 25వ తేదీన తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ క్యాపస్‌లో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. అదేవిధంగా రాష్ట్రంలోని 12 మైనారిటీ గురుకుల పాఠశాలల్లో 5,6,7,8 తరగతుల్లో మిగిలిన ఖాళీలకు ప్రవేశానికి, మూడు జూనియర్ బాలుర కళాశాలల్లో ప్రవేశానికి మైనారిటీ విద్యార్థులు మే 1 నుంచి సంబంధిత పాఠశాలల ప్రిన్సిపాళ్లను సంప్రదించి నేరుగా అడ్మిషన్ పొందవచ్చన్నారు.

బాబుతోనే భవిష్యత్తుకు గ్యారెంటీ


ఇంటింట ప్రచారం నిర్వహిస్తున్న సంధ్యారాణి

గూడూరు, మార్చి 4: చంద్రబాబునాయుడుతోనే రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు గ్యారెంటీ ఉంటుందని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సతీమణి సంధ్యారాణి అన్నారు. సోమవారం స్థానిక సంయుక్త నగర్‌లో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలోనే నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకశాలు కల్పించడం జరిగిందన్నారు. వైసీపీ ప్రభుత్వం యువతకు జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని హామీ ఇచ్చి మోసం చేసిందన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే మహిళలకు మహాశక్తి పథకం ద్వారా పలు సంక్షేమ పథకాలను అమలు చేసేలా చంద్రబాబునాయుడు మినీ మెనిఫెస్టోను రూపొందించారన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని ఆదరించాలన్నారు. కార్యక్రమంలో పులిమి శ్రీనివాసులు, రవీంద్రరెడ్డి, ప్రవీణ్, తూపిలి సురేంద్ర, సుమన్, బిల్లు చెంచురామయ్య, సద్దాం, అమరయ్య, గుండాల లీలావతి, భారతి, లక్ష్మి, రేవతి తదితరులు పాల్గొన్నారు.

తడ పోలీస్ స్టేషన్‌కు శిక్షణ ఎస్పీ

రెండు నెలలపాటు విధుల నిర్వహణ


దేవరాజ్ మనీష్‌పాటిల్

తడ, మార్చి 4: తడ పోలీస్ స్టేషన్‌కు ట్రైనీ ఎస్పీని అధికారులు నియమించారు. పోలీస్ స్టేషన్ వ్యవహారాలు, నిర్వహణ వంటి విషయాలపై అవగాహన కోసం 2022 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన దేవరాజ్ మనీష్‌పాటిల్ ఇక్కడ నియమితులయ్యారని, ఆయన రెండు నెలలపాటు ఇక్కడ విధుల్లో ఉంటున్నట్లుగా స్థానిక పోలీసులు తెలిపారు. సోమవారం విధుల్లో చేరిన ట్రైనీ ఎస్పీ దేవరాజ్ మనీష్‌పాటిల్ రాష్ట్ర సరిహద్దులోని పన్నంగాడు, భీములవారిపాళెం వద్ద చెక్‌పోస్టును తనిఖీ చేశారు. ఆయన వెంట సూళ్లూరుపేట సీఐ మధుబాబు, ఎస్ఐ నరసింహారావు ఉన్నారు.

ప్రకృతి ఉత్పత్తుల స్టాల్ ఏర్పాటు


ప్రకృతి వ్యవసాయ స్టాల్‌ను ప్రారంభిస్తున్న ఏడీ గోపీనాయక్

గూడూరుఅర్బన్, మార్చి 4: స్థానిక గ్రామసేవకుల భవనం వద్ద వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ను వ్యవసాయశాఖ ఏడీ గోపీనాయక్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సోమవారం స్పందన కార్యక్రమానికి వచ్చే అర్జీదారులకు, స్థానికులకు అందుబాటులో ఉండే విధంగా ఈ స్టాల్‌ను ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. ఇందులో ఎటువంటి పురుగుమందులను వాడకుండానే పండించిన ఆకు కూరలు, కూరగాయలు, పండ్లు తక్కువ ధరల్లో అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏవో రమేష్, ఏపీఎం బుజ్జమ్మ, మధు, తిరుమల, కృష్ణయ్య, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

రాంకుమార్‌రెడ్డిని గెలిపించండి

డక్కిలి, మార్చి 4: తన కుమారుడు నేదురుమల్లి రాంకుమార్ రెడ్డిని గెలిపించాలని మాజీ మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి కోరారు. సోమవారం ఆమె మండలంలోని సంగనపల్లిలో పర్యటించారు. గ్రామస్థులను పేరు పేరునా పలకరిస్తూ.. మీకు గుర్తుందా మీ గ్రామానికి రోడ్డు ఏర్పాటు చేసింది నేనే అంటూ గుర్తుచేశారు. 1992లో తన భర్త జనార్దనరెడ్డి ముఖ్యమంత్రిగా వున్న సమయంలో ఆయన గ్రామానికి రావడానికి రోడ్డు సౌకర్యం లేక ఎంతో ఇబ్బంది పడ్డానని చెప్పారు. తానే భూసేకరణ చేయించి తారు రోడ్డు నిర్మించినట్లు చెప్పారు. వచ్చే ఎన్నికల్లో తన కుమారుడు రాంకుమార్ రెడ్డి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నారని, ఆయనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

ఐదుగురి బైండోవర్

బాలాయపల్లి, మార్చి 4: సార్వత్రికల ఎన్నికల నేపథ్యంలో పాత కేసుల్లో నిందితులుగా ఉన్న ఐదుమందిని బైండోవర్ చేసుకున్నట్లు బాలాయపల్లి ఎస్ఐ మహబూబ్ సుభానీ సోమవారం తెలిపారు. వీరిని తహసీల్దార్ పుల్లరావు వద్ద హాజరు పరిచామని చెప్పారు.

పుత్తూరు వార్తలు

మహాశివరాత్రి పోస్టర్ల ఆవిష్కరణ


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మంత్రి రోజా తదితరులు

పుత్తూరు, మార్చి 4: సదాశివకోనలో ఈ నెల 8వ తేదీన జరిగే మహాశివ రాత్రి ఉత్సవాల పోస్టర్లను మంత్రి రోజా ఆలయ కమిటీ సభ్యులతో కలిసి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రాంతాలతో పాటు తమిళనాడు నుంచి వచ్చే భక్తులకు విడిది, భోజన వసతులు, భద్రతను కల్పించాలని కమిటీ సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ జయచంద్ర, సభ్యులు గోపి, కమలమ్మ, ఉదయ్‌కుమార్, శేఖర్, షణ్ముగరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళా మార్ట్ ప్రారంభం

పుత్తూరు, మార్చి4: పుత్తూరు పట్టణంలోని వైఎస్సార్ భవనంలో డ్వాక్రా మహిళలలో ఆధ్వర్యంలో ఏర్పాటైన సహకార అర్బన్ జగనన్న మహిళా మార్ట్‌ను మంత్రి రోజా సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా మార్ట్ ఏర్పాటుపై మెప్మా ఆధ్వర్యంలో డ్వాక్రా సభ్యులకు శిక్షణ ఇచ్చారని, ఇలాంటి సహకార మార్ట్‌లు రాష్ట్రంలో ఇప్పటివరకు ఆరు ఏర్పాటయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో ఎండీ విజయలక్ష్మి, మున్సిపల్ చైర్మన్ హరి, కమిషనర్ కేఎల్ఎన్‌రెడ్డి, మెప్మా అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు తగిలి రైతు మృతి

కోట, మార్చి 4: మండల పరిధిలోని చెందోడులో విద్యుత్ తీగలు తగిలి మల్లి సోమయ్య(65) అనే రైతు ఆదివారం మృతి చెందారు. మండల పరిధిలోని ఊనుగుంటపాళెం గ్రామానికి చెందిన సోమయ్య చెందోడులో పోలాలను లీజుకు తీసుకొని వరి సాగు చేస్తున్నాడు. ఆదివారం వరి పంట కోసేందుకు కోత మిషన్ తీసుకెళ్తుండగా పైన విద్యుత్ తీగలు అడ్డు రావడంతో వాటిని తొలగించేందుకు ప్రయత్నించాడు. విద్యుత్ తీగలు రైతుపై పడటంతో షాక్‌కు గురై అక్కడిక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

కారు - బస్సు ఢీ: ఇద్దరికి స్వల్పగాయాలు

తడ, మార్చి 4: బస్సును కారు ఢీకొన్న ఘటన కొండూరు జాతీయ రహదారి వద్ద జరిగింది. శ్రీసిటీలోని ఓ పరిశ్రమకు చెందిన బస్సు సోమవారం మధ్యాహ్నం సమయంలో ఉద్యోగులను తీసుకొని కొండూరు జాతీయ రహదారి వద్దకు వచ్చింది. అక్కడ ఉద్యోగులను దించేసి తిరిగి బయలుదేరింది. సమీపంలోనే బస్సును మలుపుతిప్పుతుండగా చెన్నై నుంచి నెల్లూరుకు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జు కాగా, అందులో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

వైసీపీ ప్రభుత్వాన్ని సముద్రంలో కలిపేయాలి: విజయశ్రీ


సమావేశంలో మాట్లాడుతున్న నెలవల విజయశ్రీ

తడ, మార్చి 4: రాష్ట్రాన్ని దివాళా తీయించిన ముఖ్యమంత్రి జగన్ ప్రభుత్వాన్ని సముద్రంలో కలిపేయాలని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నెలవల విజయశ్రీ అన్నారు. సోమవారం స్థానిక సుజాత నగర్‌లో విజయశ్రీ పరిచయ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ పాలనతో రాష్ట్రం అభివృద్ధిలో 20 యేళ్ల వెనక్కు వెళ్లిపోయిందన్నారు. ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా, రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని విమర్శించారు. నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, పేదలకు సంక్షేమ పథకాలు అందాలన్నా చంద్రబాబు మరోమారు ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందన్నారు. నాయకులంతా కలసికట్టుగా పనిచేసి విజయశ్రీ విజయానికి కృషిచేయాలని కోరారు. అంతకుముందు నెలవల విజయశ్రీకి తెలుగు తమ్ముళ్లు పూలవర్షంతో స్వాగతం పలికారు. బజారు కూడలి నుంచి సుజాత నగర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బొమ్మన శ్రీధర్, నాయకులు సెల్వం, వేనాటి రాజారెడ్డి, సురేష్‌రెడ్డి, జయపాల్, సుదర్శన్ మొదలియార్, బొమ్మన పళణి, రవి, టీకే శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలపై రూ.12 లక్షల కోట్ల అప్పు: నెలవల

నాయుడుపేట, మార్చి 4: వైసీపీ ప్రభుత్వం రూ.12 లక్షల కోట్లు అప్పులు చేసి రాష్ట్ర ప్రజలపై పెనుభారం మోపిందని మాజీ ఎంపీ, టీడీపీ సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. దొరవారిసత్రంలో సోమవారం రాత్రి స్థానిక నేత సుదర్శన్ అధ్యక్షతన ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ నెలవల విజయశ్రీ పరిచయ కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తల ఐక్యమత్యంగా పనిచేసి విజయశ్రీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వేమసాని శ్రీనివాసులునాయుడు, రాష్ట్ర కార్యదర్శి బొమ్మన పళణి, సెల్వం, వరసుందరి, సుధాకర్, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవ్, శశి, కళ్యాణి, వాసు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే అభ్యర్థి పరిచయ కార్యక్రమం నిర్వమించారు. మండల అధ్యక్షుడు కొక్కు శంకరయ్య మాట్లాడుతూ అందరూ సమష్టిగా పనిచేసి విజయశ్రీని గెలిపించుకోవాలన్నారు. విజయశ్రీ మాట్లాడుతూ తనకు రాజకీయాలు కొత్తయినా టీడీపీ కుటుంబ సభ్యులందరూ ఆదరించి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, దేవారెడ్డి సుధాకర్ రెడ్డి, వెంకటసుబ్బయ్య, మాధవ నాయుడు, నెలవల రాజేష్, పార్థసారధి, సుజాత, భవాని, సుబ్రమణ్యం, వెంకటేశ్వర్లు, తిరుపాల్, బుజ్జిబాబు, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి ప్రభుత్వ ఏర్పాటుకు కలిసికట్టుగా పనిచేద్దాం: పాశం


ప్రచార వాహనాలను ప్రారంభిస్తున్న పాశం సునీల్‌కుమార్

గూడూరు, మార్చి 4: టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో ఉమ్మడి ప్రభుత్వ ఏర్పాటుకు అందరం కలిసికట్టుగా పనిచేద్దామని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ - జనసేన అభ్యర్థుల ప్రచారం కోసం ఎన్ఆర్ఐ కొట్టే ఉదయ్ భాస్కర్ అందజేసిన 25 ప్రచార వాహనాలను సోమవారం దివిపాళెం గ్రామ సమీపంలో జెండా ఊపి వాటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ - జనసేన ఉమ్మడి అభ్యర్థుల ప్రచారం కోసం ఎన్ఆర్ఐ ఉదయ్‌భాస్కర్ 25 వాహనాలను అందజేయడం అభినందనీయమన్నారు. టీడీపీ - జనసేన పార్టీల కలయికను రాష్ట్ర ప్రజలు స్వాగతిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో ఉమ్మడి ప్రభుత్వ ఏర్పాటు అందరం కలిసికట్టుగా పనిచేద్దామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు కరిముల్లా, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లురాజు, బిల్లు చెంచురామయ్య, తీగల చంద్రశేఖర్, కొట్టే వెంకటేశ్వర్లు, అబ్దుల్‌రహీం, చంద్రమౌళి, పెంచలయ్య, నరసరాజు, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా గూడూరులోని టీడీపీ కార్యాలయంలో వాకాడు మండలం నెల్లిపూడి గ్రామానికి చెందిన పలువురు టీడీపీలో చేరడంతో వారికి సునీల్‌కుమార్ కండువాలను కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో దువ్వూరు మధుసూదన్‌రెడ్డి, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, కృష్ణమూర్తి, శ్రీనివాసులురెడ్డి, సుధాకర్‌రెడ్డి, గోవిందయ్య, రమణయ్య, నాగరాజు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా దివిపాళెం ప్రాంతంలో పలువురు టీడీపీలో చేరారు.

భూ సమస్యలను పరిష్కరించండి


ఆర్డీవోకు వినతిపత్రం సమర్పిస్తున్న సీపీఐ నాయకులు

శ్రీకాళహస్తి, మార్చి 4: శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని రూరల్, రేణిగుంట మండలంలో ఉన్నటువంటి దళిత, గిరిజన భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఐ తిరుపతి జిల్లా కార్యదర్శి మురళి డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం నిరసన ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తి మండలంలోని రామాపురం రెవిన్యూలో తొండమనాడు, ఎగువవీధి, అమ్మపాళెం, ఫుల్లారెడ్డి కండిగ తదితర గ్రామాల వారికి ప్రభుత్వం 1991లో సాగుభూమి పట్టాలు మంజూరు చేసిందన్నారు. ఆన్‌లైన్ రికార్డుల్లో ఆ భూమి వివరాలు రాక పేదలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. వాగేడు రెవిన్యూలో దళితులు సాగుచేసు కుంటున్న భూమికి పట్టాలివ్వాలని కోరారు. హైవే నిర్మాణంలో ఇళ్లు, స్థలాలు కోల్పోయిన రేణిగుంట మండలంలోని శ్రీనివాసపురం బీసీ కాలనీ, ఆంజనేయపురం కాలనీవాసులకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. అనంతరం ఆర్డీవో రవిశంకర్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జనమాల గురవయ్య, నాయకులు శివకుమార్ తులసి, రాజన్, మణి, మోహన్‌రెడ్డి, గురవయ్య, మురళి, రాజయ్య, వినాయక, లతమ్మ తదితరులు పాల్గొన్నారు.

పట్టణశివారులో చోరీ

తొట్టంబేడు, మార్చి 4: శ్రీకాళహస్తి పట్టణ శివారులోని శివనాథపురం రాజీవ్‌నగర్ వద్ద ఓ ఇంట్లో చోరీ జరిగింది. ఎస్ఐ రాఘవేంద్ర కథనం మేరకు ..లలిత రేణిగుంట వద్దనున్న ఓ ప్రైవేటు కర్మాగారంలో పనిచేస్తోంది. ప్రస్తుతం వారంల రోజులుగా కన్నలిలోని అమ్మగారి ఇంట్లో ఉంటూ విధులకు వెళ్లి వచ్చేది. సోమవారం రాజీవ్‌నగర్‌లోని ఇంటికి వెళ్లింది. తలుపులు బీగాలు పగిలిపోయి ఉండడంతో పోలీసులకు సమాచారం అందించింది. పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. బీరువాలో ఉన్న ఒక సవరం బంగారు గొలుసు, రూ.20వేల నగదు చోరీ చేశారని తెలిపింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

సుధీర్‌రెడ్డికి ఒక అవకాశం ఇవ్వండి

తొట్టంబేడు, మార్చి 4: వచ్చే ఎన్నికల్లో బొజ్జల సుధీర్‌రెడ్డికి ఎమ్మెల్యేగా ఒక అవకాశం ఇవ్వాలని ఆయన సతీమణి రిషితారెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. మండలంలోని చేమూరు, బోనుపల్లి, కంచినపల్లి పంచాయతీలలో ఆమె సోమవారం ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతినాయుడు, మండల అధ్యక్షులు మురళి నాయుడు, మునిరాజనాయుడు, వెంకటాచలం, జడ్పీ టీసీలు వెంకట సుబ్బారెడ్డి, అర్చనాదేవి, తిరుమలయ్య, కన్నలి ప్రతాప్‌రెడ్డి, నాయకులు ప్రవీణ్‌రెడ్డి, మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఏర్పాట్ల పరిశీలన

ఏర్పేడు, మార్చి 4: ఏర్పేడు మండలంలోని గుడిమల్లంలో కొలువైన పరశురామేశ్వరాలయంలో ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చైర్మన్ నరసింహయాదవ్, ఈవో రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో పరిశీలించారు. ప్రత్యేక క్యూలైన్లు, భోజనవసతి, హోమాలు, కల్యాణోత్సవం ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. మహా శివరాత్రి పర్వదినాన భక్తులు అధికంగా వచ్చే అవకాశం ఉండడంతో కారు పార్కింగ్ స్థల పరిశీలన చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు ఉదయభాస్కర్‌రాజు, సీఐ శ్రీరామశ్రీనివాసులు, వైసీపీ మండల ఇన్‌చార్జి కిషోర్‌రెడ్డి, సర్పంచ్ సుబ్రహ్మణ్యంయాదవ్ పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నేత కేపీఆర్ మృతి


ప్రభాకర్ (ఫైల్‌ఫొటో)

ఏర్పేడు, మార్చి 4: ఏర్పేడు మండలం టీడీపీ సీనియర్ నాయకులు, ఆమందూరు పంచాయతీ గ్రామ కమిటీ అధ్యక్షులు కన్నవరం ప్రభాకర్‌రావు (47) అనారోగ్యంతో మృతిచెందారు. రెండు రోజుల క్రితం గుండెపోటుతో తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరారు. చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతిచెందారు. ప్రభాకర్‌రావుకు భార్యతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు. మంగళవారం సాయంత్రం అంత్యక్రియలు జరగనున్నాయి. ఆయన మృతి పార్టీకి తీరని లోటని టీడీపీ మండల అధ్యక్షుడు పొన్నారావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గురవారెడ్డి పేర్కొన్నారు.

సత్యవేడు టికెట్ కోసం వినతి

బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 4: టీడీపీ సత్యవేడు అసెంబ్లీ టికెట్ తనకు కేటాయించాలని మండలానికి చెందిన గాజులపెళ్లూరుకు చెందిన కిరణ్ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడిని కోరారు. సోమవారం విజయవాడలోని పార్టీ కార్యాలయంలో కలసి విన్నవించారు.

రాయితీపై సోలార్ ప్యానల్స్

గూడూరు, మార్చి 4: కేంద్ర ప్రభుత్వం రాయితీతో సోలార్ ప్యానల్స్ అందజేస్తుందని, ఆసక్తి ఉన్న వారు పోస్టల్ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని హెడ్ పోస్టాఫీసు సూపరింటెండెంట్ కుమార్, అసిస్టెంట్ సూపరింటెండెంట్ మణిగంధన్ తెలిపారు. 1కేవీ, 2కేవీ, 3కేవీ సోలార్ ప్యానల్స్‌ను 40 శాతం రాయితీపై అందజేస్తారని చెప్పారు.

పేకాట, కోడిపందేల స్థావరాలపై దాడులు

చిట్టమూరు, మార్చి 4: పేకాట, కోడిపందేల స్థావరాలపై పోలీసులు ఆదివారం రాత్రి దాడులు నిర్వహించారు. ఏకసిరి మంగళకండ్రిగ అటవీ ప్రాంతంలో కోడిపందేలు నిర్వహిస్తున్నట్లు తెలుసుకున్న ఎస్ఐ చిన్న బలరామయ్య సిబ్బందితో కలసి దాడులు జరిపారు. ఆరుగురిని అదుపులోకి తీసుకుని ఆరు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఆరూరు పెద్ద దళితవాడలో పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

షరా మామూలే..!

కలెక్టరేట్‌కు పోటెత్తిన బాధితులు
'స్పందన'కు వచ్చిన అర్జీలు 167


అర్జీదారుడి సమస్యను తెలుసుకుంటున్న కలెక్టర్ లక్ష్మీశ

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 4: తమ సమస్యలు పరిష్కరించాలని ఎప్పటిలాగే బాధితులు కలెక్టరేట్‌కు పోటెత్తారు. సోమవారం జరిగిన స్పందన కార్యక్రమానికి 167 అర్జీలు అందాయి. వీటిల్లో అత్యధికంగా 133 అర్జీలు భూ సమస్యల పైనే ఉన్నాయి. బాధితుల నుంచి అర్జీలను కలెక్టర్ లక్ష్మీశతో పాటు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు మురళి, భాస్కర్‌నాయుడు, చంద్రశేఖర్‌నాయుడు, దేవేంద్రరెడ్డి స్వీకరించారు. స్పందనకు వచ్చిన అర్జీలకు అధిక ప్రాధాన్యమివ్వాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

సదరం సర్టిఫికెట్ ఇప్పించండి



నాకు ఎడమకాలు పనిచేయదు. ఒక కన్ను దృష్టిలోపం ఉంది. అలాగే బ్రెయిన్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నా. సదరం సర్టిఫికెట్ 80శాతం ఇవ్వాలని తిరుగుతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదు. మీరైనా విచారించి సర్టిఫికెట్ ఇప్పించండి

- దేవేంద్ర, అప్పలాయగుంట, వడమాలపేట మండలం

సాగునీటి కాలువను కబ్జా చేశారు



మా మండలంలోని పత్తిపుత్తూరులో సాగునీటి కాలువను కొంతమంది ఎక్స్‌కవేటర్లతో పూడ్చివేస్తున్నారు. రైతులకు ఉపయోగపడే కాలువను పూడ్చివేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకోండి.

-చెంగల్రాయులు, చింతకాల్వ, వడమాలపేట మండలం

శైవక్షేత్రాలకు 436 అదనపు ఆర్టీసీ బస్సులు

తిరుపతి(కొర్లగుంట), మార్చి 4: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శైవక్షేత్రాలకు 436 అదనపు ఆర్టీసీ బస్సులు నడపనున్నట్లు ప్రజా రవాణాధికారి చెంగల్‌రెడ్డి తెలిపారు. డీపీటీవో కార్యాలయంలో ఆయన సోమవారం అధికారులతో సమీక్షించారు. శుక్రవారం శివరాత్రి పర్వదినం సందర్భంగా మూడ్రోజులపాటు జిల్లా పరిధిలో ఉన్న శ్రీకాళహస్తి, తలకోన, కైలాసకోన, సదాశికోన, మూలకోన, అవంతి, గుడిమల్లం, పంత్రంగం, యాకసిరితిప్ప వంటి పుణ్యక్షేత్రాలకు భక్తుల సందడి అధికంగా ఉంటుందని తెలిపారు.

7,8,9 తేదీల్లో నడిచే సర్వీసులిలా..

తిరుపతి-తలకోన మధ్య 70, కోడూరు-తలకోన మధ్య 40, తిరుపతి-గుడిమల్లం మధ్య 7, శ్రీకాళహస్తి-తిరుపతి మధ్య 100, శ్రీకాళహస్తి-నాయుడుపేట మధ్య 8, శ్రీకాళహస్తి-పిచ్చాటూరు మధ్య 18, శ్రీకాళహస్తి వయా తడ,చెన్నై మధ్య 25, శ్రీకాళహస్తి-గుడిమల్లం మధ్య 4, పుత్తూరు-సదాశివకోన మధ్య 100, పుత్తూరు-కైలాసకోన మధ్య 8, పుత్తూరు-మూలకోన మధ్య 8, ఊత్తుకోట-సదాశివకోన మధ్య 17, వరదయ్యపాళెం-అవంతి మధ్య 8, కోట-పంత్రంగం మధ్య 6, నాయుడుపేట-పంత్రంగం మధ్య 6, నాయుడుపేట-యాకసిరితిప్ప మధ్య 5, గూడూరు-శ్రీకాళహస్తి మధ్య 6 మొత్తం 436 బస్సులను కేటాయించారు. ఇవి గురువారం ఉదయం నుంచి ప్రయాణికులకు అందుబాటులో ఉంటాయి.

నడికుడి - శ్రీకాళహస్తి రైల్వేలైను
భూసేకరణ పనులు వేగవంతం
- కలెక్టర్ లక్ష్మీశ

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 4: జిల్లాలో నడికుడి - శ్రీకాళహస్తి మధ్య రైల్వేలైనుకు సంబంధించి భూసేకరణ పనులు వేగవంతం చేసినట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. రైల్వే, జాతీయ రహదారులకు సంబంధించిన భూసేకరణ, పరిహారం పంపిణీ, బడ్జెట్ విడుదల పలు అంశాలపై న్యూఢిల్లీ నుంచి కేంద్ర అధికారులు వివిధ రాష్ట్రాల కార్యదర్శులు, కలెక్టర్లు, జేసీలు, జాతీయ రహదారుల అధికారులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. జిల్లా నుంచి కలెక్టర్ సంబంధిత అధికారులతో హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ వివరిస్తూ.. రైల్వే లైనుకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న సుమారు 182 ఎకరాల డీకేటీ భూములకు సంబంధించిన అవార్డు పాసింగ్ రానున్న జూన్‌కంతా పూర్తి చేస్తామన్నారు. కలెక్టరేట్ సిబ్బంది, భూసేకరణ డీటీ భాస్కర్ పాల్గొన్నారు.

'అగ్నివీర్' రిక్రూట్‌మెంట్ రిజిస్ట్రేషన్ ప్రారంభం

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 4: అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ 2024-25 కోసం రిజిస్ట్రేషన్ ప్రారంభమైందని సంబంధిత అధికారులు తెలిపారు. ఈనెల 22వ తేదీవరకు గడువిచ్చారు. అగ్నివీర్ జనరల్ డ్యూటీ, టెక్నికల్, ఆఫీస్ అసిస్టెంట్/స్టోర్‌కీపర్, టెక్నికల్, ట్రేడ్స్ మ్యాన్ తదితర పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు. వివరాలకు www.joinindianarmy.nic.inలో చూడవచ్చు.

మాజీ ఉపరాష్ట్రపతి నేడు తిరుపతి రాక

రేణిగుంట, మార్చి 4: రాష్ట్రీయ సేవా సమితి (రాస్) ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం తిరుపతిలోని పీఎల్ఆర్ కన్వెన్షన్‌లో ముందస్తు అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరగనుంది. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా హాజరయ్యేందుకు మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు తిరుపతికి వస్తున్నారు. అలాగే స్థానిక రాజకీయ ప్రముఖులు పాల్గొననున్నారు. రాస్ లబ్ధిదారులు, మహిళా సంఘాల సభ్యులు, సిబ్బంది, రాస్ జనరల్‌బాడీ, కార్యనిర్వాహక సభ్యులు పాల్గొనాలని రాస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.వెంకటరత్నం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

కారును ఢీకొన్న ఆర్టీసీ బస్సు

గూడూరు అర్బన్, మార్చి 4: మండలం పరిధిలోని ఆదిశంకర కళాశాల సమీపంలో సోమవారం కారును ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు. రూరల్ పోలీసుల వివరాల మేరకు... బెంగళూరు నుంచి నెల్లూరు వైపు వెళుతున్న కారును అదే మార్గంలో వెళుతున్న ఆర్టీసీ బస్సు అదుపుతప్పి వెనుక నుంచి ఢీకొంది. ముందువైపు మరో ఆర్టీసీ బస్సు ఆగివుండడంతో రెండు బస్సుల మధ్య కారు నుజ్జునుజ్జయింది. అయితే కారులో వెళుతున్న ఐదుగురికి ఎటువంటి గాయాలు కాలేదు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చంద్రబాబుతోనే రామరాజ్య స్థాపన: కురుగొండ్ల

వెంకటగిరి, మార్చి 4: చంద్రబాబులో రాష్ట్రంలో రామరాజ్య స్థాపన సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. సోమవారం పట్టణ పరిధిలోని 12వ వార్డు మల్లమ్మ గుడి వీధిలో నిర్వహించిన బాబు ష్యూరిటీ భవిషత్ గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. ప్రస్తుతం రాష్ట్రంలో రాజారెడ్డి రాజ్యాంగం నడుస్తోందన్నారు. రాష్ట్రానికి విముక్తి కలగాలంటే రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు తోట కృష్ణయ్య, టీడీపీ నాయకులు పులికొల్లు రాజేశ్వరావు, కేవీకే ప్రసాద్ నాయుడు, శ్రీరామదాను గంగాధర్, కాపా శ్రీనివాసులునాయుడు, ఆనంద్, తాండవ చంద్రారెడ్డి, సుధ పాల్గొన్నారు.

శంఖారావాన్ని విజయవంతం చేయండి

వెంకటగిరి, మార్చి 4: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఆధ్వర్యంలో నిర్వహించే శంఖారావం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు. సోమవారం ఆయన నివాసంలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని పట్టణ, అన్ని మండలాల అధ్యక్షులు, క్లస్టర్, యూనిట్, బూత్, సెక్షన్ ఇన్‌చార్జిలు, ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. శంఖారావం సూపర్ సిక్స్ కిట్లను పంపిణీ చేశారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

చిల్లకూరు, మార్చి 4: అగ్నిప్రమాదాల నివారణపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగివుండాలని జిల్లా చీఫ్ అగ్నిమాపక అధికారి రమణయ్య అన్నారు. సోమవారం మండలంలోని లింగవరం సమీపంలోని జిందాల్ పరిశ్రమలో జాతీయ భద్రతా వారోత్సవాల్లో భాగంగా అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కార్యాక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమల్లో అగ్నిప్రమాదాలు జరగకుండా ఫైర్ సేఫ్టీ పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అనంతరం జిందాల్ పరిశ్రమ ప్రతినిధులు ఆయనను సన్మానించారు. శ్రీనివాసరావు, మన్సూరి, విల్సన్, సురేష్ పాల్గొన్నారు.

శివయ్య వైభవం


ఊరేగింపులో స్వాగత తోరణం


శివ వేషధారి

శ్రీకాళహస్తీశ్వరాలయంలో శివయ్య బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం స్వామివారిని అధికసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

- శ్రీకాళహస్తి


ఊరేగింపులో పంచమూర్తులు

శ్రీకాళహస్తి సత్యవేడు

7న ఉద్యోగ మేళా

శ్రీకాళహస్తి, మార్చి 4: ఈ నెల 7న పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ డిగ్రీ కళాశాలలో ఉద్యోగమేళా నిర్వహించనున్నట్లు పురపాలక కమిషనర్ రమేష్ బాబు సోమవారం ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 13 బహుళ జాతీయ కంపెనీలు పాల్గొంటాయని వివరించారు. పదో తరగతి నుంచి డిగ్రీ, ఇంజనీరింగ్ వరకు చదువుకున్న నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

వైఎస్ విగ్రహావిష్కరణ



రేణిగుంట, మార్చి4: రేణిగుంటలోని బజారు వీధిలో ఫ్లైఓవర్ వద్ద ఏర్పాటు చేసిన వైఎస్ఆర్ కాంస్య విగ్రహాన్ని ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్యే మధు సూదనరెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం సోమవారం ఆవిష్కరించారు. అంతకు ముందు కొత్త చెక్‌పోస్టు కూడలి నుంచి విగ్రహం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ హరిప్రసాద్ రెడ్డి, సర్పంచ్ నగేషం, జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు మహమ్మద్ రసూల్, నాయకులు మునిరెడ్డి, రమేష్, బాబ్జిరెడ్డి, మునిశేఖర్‌రెడ్డి, సుజాత, సుశీల, పురుషోత్తంరెడ్డి, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి ..

తొట్టంబేడు, మార్చి 4: శ్రీకాళహస్తి మండలం ఊరందూరులోని శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి స్వగృహంలో శ్రీకాళహస్తి మండలంలోని పెనుబాకు, శనగలమిట్ట గ్రామాలకు చెందిన పలువురు వైసీపీ వారు టీడీపీలో చేరారు. వైసీపీ నాయకులు దేవా, మహేంద్ర, నాగయ్య, శ్రీనివాసులు, మిత్రబృందం సుమారు 150మంది టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి చెంచయ్యనాయుడు, సతీష్, రమేష్‌నాయుడు, శ్రీనివాసులునాయుడు, వెంకటక్రిష్ణమనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఏర్పేడు: తిరుపతి ఎంపీ గురుమూర్తి స్వగ్రామమైన మన్నసముద్రంలో సుధీర్‌రెడ్డి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గురవారెడ్డి, పొన్నారావు, ధనంజయులునాయుడు, శివశంకర్‌రెడ్డి, మునెయ్య, సూరి నాయు డు, నాగేశ్వరరావు, చెంచయ్యనాయుడు, కృష్ణవేణి, సుబ్రహ్మణ్యం, గుణయాదవ్, రమణ, హంస, చంద్రశేఖర్‌రాజు పాల్గొన్నారు.

సిపాయి భరోసా అందజేత

తొట్టంబేడు, మార్చి 4: శ్రీకాళహస్తి మండలంలోని గోవిందరాజుపల్లి పంచాయతీలోని మాధవగిరి గ్రామంలో సిద్ధయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయిసుబ్రమణ్యం సిపాయి భరోసా కింద 40 రకాల నిత్యావసర వస్తువులను వారి కుటుంబానికి సోమవారం అందజేశారు. అనంతరం కొందరు వైసీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో రత్నంరెడ్డి, వడ్లతాంగాల్ బాలాజీరెడ్డి, మధురెడ్డి, భరత్‌రెడ్డి, వెంకటాద్రి, భాస్కర్, దాము, శంకరయ్య, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

దాతల సాయంతో సిమెంట్ రోడ్డు నిర్మాణం



కేవీబీపురం, మార్చి4: మండలంలోని కొత్తూరు గ్రామంలో దాతల సాయంతో 300మీటర్ల మేర సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించినట్లు సర్పంచ్ సుబ్రమణ్యం తెలిపారు. బీఎస్ఆర్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు సుబ్రమణ్యం రెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి, మురళీకృష్ణ, భక్తవత్సలం ఆర్థికసాయం అందించడంతో గ్రామస్తుల శ్రమదానం చేశారు. దాతలకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 4: మండలంలోని కనమనంబేడు, బీఎన్ కండ్రిగ గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ ఆలీఖాన్, డిప్యూటీ తహసీల్దార్ చంద్రబాబు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డబుల్ ఎంట్రీలు, డూప్లికేట్, మరణించిన వారి ఓట్లను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఫారం-8 దరఖాస్తులను తమ వద్దకు తీసుకు రావాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు కేంద్రానికి నెంబరు, నియోజక వర్గం నెంబరు, ఆర్వో, ఏఈఆర్వో, బీఎల్వో, ఎస్‌హెచ్‌వోల హోదా, ఫోన్ నెంబర్లు తప్పక రాయించాలని సూచించారు.

నలుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

తొట్టంబేడు, మార్చి 4: మండలంలోని పూడి గ్రామంలో పేకాట ఆడుతున్న నలుగురిని పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. వారి నుంచి రూ.2,250 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ రాఘవేంద్ర కేసు నమోదు చేసి నిందితులను రిమాండుకు తరలించారు.

ప్రభుత్వ భూముల్లో ప్రవేశిస్తే చర్యలు తప్పవు



హెచ్చరికబోర్డు ఏర్పాటు చేస్తున్న అధికారులు

వరదయ్య పాళెం, మార్చి 4: వరదయ్యపాళెం మండలంలోని ప్రభుత్వ భూముల్లో ప్రవేశిస్తే కఠిన చర్యలు చేపడుతామని తహసీల్దారు ఉదయభారతి హెచ్చరించారు. పాండూరు రెవెన్యూ పరిధిలో సచివాలయానికి దారిలేకుండా ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురి కావడంతో రెండు రోజుల క్రితం 'రెవెన్యూశాఖలో ముడుపుల మాయాజాలం' అనే శీర్షికన కథనం వెలువడిన విషయం విదితమే స్పందించి తహసీల్దారు పాండూరు రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 915.5బిలో ఆక్రమణకు గురైన 1.70ఎకరాల ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో ఆదిలక్ష్మి, వీఆర్ఏలు పాల్గొన్నారు.

చేపల చెరువుకు వేలం నిర్వహించాలి

వరదయ్యపాళెం, మార్చి 4: వరదయ్యపాళెం మండలం రాచర్ల పంచాయతీ మోపూరుపల్లి చెరువుకు బహిరంగ వేలం నిర్వహించాలని గ్రామస్తులు కోరుతున్నారు. కొందరు పంచాయతీ అనుమతిలేకుండా చేపలు పట్టుకుని ప్రభుత్వ ఖజానాకు గండికొడుతున్నారని పేర్కొంటున్నారు.

నేటి నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు



పార్వతీ సమేత సిద్ధేశ్వరాలయం

ఏర్పేడు, మార్చి 4: ఏర్పేడు మండలం చిందేపల్లిలో వెలసిన పార్వతీ సమేత సిద్ధేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు 5 నుంచి 9వ తేదీ వరకు వైభవంగా జరగనున్నాయి. ప్రతిరోజూ భక్తులకు అన్నదానం నిర్వహించనున్నామని ఆలయ ధర్మకర్త గంగలపూడి గిరిధర్‌రెడ్డి తెలియజేశారు.

శ్రీకాళహస్తి ఆర్టీసీ బస్టాండును ఆధునికీకరిస్తాం



రికార్డులను పరిశీలిస్తున్న మిద్దెల హరి

శ్రీకాళహస్తి, మార్చి 4: శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపోను ఆధునికీకరించేందుకు చర్యలు చేపడుతున్నామని ఆర్టీసీ వైస్ చైర్మన్ మిద్దెల హరి తెలిపారు. శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపోను సోమవారం ఆయన సందర్శించారు. డిపో మేనేజర్ రాజవర్ధన్ రెడ్డి ఘనస్వాగతం పలికారు. ఆర్టీసీ పరిసరాలు, గ్యారేజీ, రికార్డులను పరిశీలించారు. డిపోలో సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డితో కలిసి ఆధునికీకరణ పనులు ప్రారంభిస్తామని చెప్పారు. అలాగే ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

అడ్డదారి దర్శనాలపై ప్రత్యేక నిఘా

శ్రీకాళహస్తి, మార్చి 4: శ్రీకాళహస్తీశ్వరాలయంలో అడ్డదారి దర్శనాలకు ప్రవేశించే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు శ్రీకాళహస్తి 1వ పట్టణ సీఐ నరసింహారావు సోమవారం ప్రకటనలో తెలిపారు. మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా అడ్డదారి దర్శనాలు అరికట్టేందుకు దృష్టి సారించామని పేర్కొన్నారు. నిబంధనలు అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు.. భూత, చిలుక వాహన సేవలు

శ్రీకాళహస్తి, మార్చి 4: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో ఒక్కో రాత్రిని ఒక్కో పేరుతో పిలుస్తారు. మంగళవారం భూతరాత్రిని పురస్కరించుకుని భూత గణాలకు ఆధిపత్యం వహిస్తున్న పరమేశ్వరుడు భూత వాహనంపై, ఆయన దేవేరి జ్ఞాన ప్రసూనాంబిక చిలుక వాహనంపై పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దివ్యదర్శనం ఇవ్వనున్నారు. ఉదయం సూర్య ప్రభపై స్వామివారు, చప్పరంపై అమ్మవారు ఊరేగనున్నారు.

వైసీపీని ప్రజలు నమ్మే పరిస్థితి లేదు: జనసేన



తొట్టంబేడు, మార్చి 4: వైసీపీని ప్రజలు నమ్మే పరిస్థితి లేదని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ కోట వినుత అన్నారు. శ్రీకాళహస్తి మండలంలోని పాపనపల్లి, ఎల్లంపల్లి గ్రామాలలో ఆమె సోమవారం ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ-జనసేన ఉమ్మడి మ్యానిఫెస్టోను ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు దండి రాఘవయ్య, ఉపాధ్యక్షుడు కావలి శివకుమార్, జనసైనికులు గణేష్, పేట చంద్రశేఖర్, జ్యోతి, ప్రసాద్, చందు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న శివపార్వతుల కల్యాణం







శివపార్వతుల కల్యాణం పద్యనాటకం, లావణ్య బృందం నృత్యప్రదర్శన, తేజస్విని బృందం భక్తి రంజని

తొట్టంబేడు, మార్చి 4: శ్రీకాళహస్తి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వర్ణముఖి నదీతీరాన ఏర్పాటు చేసిన ధూర్జటి కళాప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ నేపథ్యంలో అభినయ్ ఆర్ట్స్, తిరుపతి, బీఎన్‌రెడ్డి ఆధ్వర్యంలో 'శివపార్వతుల కల్యాణం' పౌరాణిక భక్తిరస పద్యనాటకం భక్తులను అలరించింది. అనంతరం శ్రీకాళహస్తి లావణ్య బృందం నృత్యప్రదర్శన, చెన్నై శ్రీతస్విని బృందంచే భక్తి రంజని, కాణిపాకం తేజశ్రీ బృందం నాట్యప్రదర్శనతో భక్తులను మెప్పించారు. కళాకారులను దేవస్థానం అధికారులు దుశ్శాలువా కప్పి, స్వామి అమ్మవార్ల చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేసి సత్కరించారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు...

రెండవ తిరునాళ్ళ, భూతరాత్రి (మాఘ బహుళ దశమి)

ఉబయదారులు: శ్రీకాళహస్తి హరిజన సేవా సంఘం తరపున పసల రమణయ్య గ్రామ పెద్దలు

వాహనసేవలు...

ఉదయం 9 గంటలకు, సూర్యప్రభ, చప్పర వాహనసేవ

రాత్రి 8 గంటలకు భూత, చిలుక వాహనసేవ

నిత్య ఉత్సవాల వివరాలు..

- ఉదయం 4:30 గంటలకు, మంగళ వాయిద్యాలు
- ఉదయం 5 గంటలకు: గోపూజ, సర్వదర్శనం
- ఉదయం 6 గంటలకు: ప్రథమ కాల అభిషేకం
- ఉదయం 7గంటలకు, ద్వితీయ కాల అభిషేకం
- ఉదయం 8 గంటలకు పరివార దేవాలయాల నైవేద్యం
- ఉదయం 9 గంటలకు శ్రీస్వామిఅమ్మవార్ల పురవీధుల ఉత్సవం
- ఉదయం 10:30 గంటలకు ఉచ్చికాల అభిషేకం
- సాయంత్రం 5 గంటలకు ప్రదోష కాలాభిషేకం
- రాత్రి 8 గంటలకు స్వామి, అమ్మవార్ల పురవీధుల ఉత్సవం
- రాత్రి 9 గంటలకు దర్శనం ముగింపు

ముక్కంటీశుడికి గొడుగుల సమర్పణ



శ్రీకాళహస్తి, మార్చి 4: శ్రీకాళహస్తీశ్వ రాలయ మహా శివరాత్రి ఉత్సవాల్లో ఊరేగింపు కోసం తమిళనాడుకు చెందిన గోపాల్ ఐదు ఉత్సవ గొడుగులను సమర్పించారు. ఈ మేరకు సోమవారం దాతలు గొడుగులను ముక్కంటి ఆలయ అధికారులకు అందజేశారు. అధికారులు వారికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లుచేసి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఆలయ మాజీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈవో నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సైకోను తరిమేద్దాం.. సైకిల్‌ను స్వాగతిద్దాం : టీడీపీ



కరపత్రాలు పంచుతున్న హెలెన్, నాయకులు

నాగలాపురం, మార్చి 4: సైకో పాలనను తరిమికొట్టి సైకిల్ పాలనకు స్వాగతం పలుకుదామని సత్యవేడు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ హెలెన్ అన్నారు. సోమవారం నాగలాపురం మండల పరిధిలోని కాళంజేరి గ్రామంలో సూపర్ సిక్స్‌పై ఇంటింటా ప్రచారం చేశారు. టీడీపీ అధికారంలో వస్తేనే ప్రజలకు బంగారు భవిష్యత్తు ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పార్తీబన్, జాన్సన్, చాంద్‌బాషా, ఎండీ కుమార్, పురుషోత్తంనాయుడు, పరశురాం శిల్పి, రుద్రయ్య నాయుడు, మనోజ్‌కుమార్ నాయుడు, తెన్నరసు, పరశురాం, మాతయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీసిటీలో ముగిసిన జాతీయ భద్రతా వారోత్సవాలు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అధికారులు

శ్రీసిటీ, మార్చి 4: కార్మికుల భద్రత ప్రాముఖ్యతను గుర్తిస్తూ శ్రీసిటీలో సోమవారం 53వ జాతీయ భద్రతా వారోత్సవాల ముగింపు ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. స్థానిక బిజినెస్ సెంటర్ వద్ద శ్రీసిటీ ప్రెసిడెంట్(ఆపరేషన్స్) సతీష్ కామత్ భద్రతా జెండాను ఎగురవేసి భద్రతా ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని స్థాయిలలో ప్రతిఒక్కరూ భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భద్రతా వారోత్సవాల్లో భాగంగా వారం రోజుల పాటు నిర్వహించిన వివిధ పోటీల్లో చిన్మయ విద్యాలయ, అకార్డ్ స్కూలు, ఇరుగుళం, మాదనపాళెం జడ్పీ హైస్కూళ్ల విద్యార్థులు, ఉద్యోగులు చురుగ్గా పాల్గొన్నారు. శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ (ప్రాజెక్టు) శేఖర్, సెక్యూరిటీ హెడ్ రమేష్ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. శ్రీసిటీ సేఫ్టీ మేనేజర్ కె.నరేంద్రబాబు కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో శ్రీసిటీ ఉద్యోగులు, పరిశ్రమల సిబ్బందితో పాటు సమీప పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీ సర్పంచ్‌నని బిల్లులు పెట్టడం లేదు

గ్రామస్తులతో కలిసి సర్పంచ్ ధర్నా



కేవీబీపురం, మార్చి4: టీడీపీ సర్పంచ్ అనే కారణంతో చేసిన పనులకు బిల్లులు పెట్టడం లేదని ఓళ్లూరు సర్పంచ్ సురేష్ వాపోయారు. సోమ వారం గ్రామస్తులతో కలిసి సచివాలయం వద్ద ఆయన ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో తాగునీటి బోరు వేయించి మోటర్లు బిగించామన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ పరిశీలించి ఎంబుక్‌లో బిల్లు పెట్టాలని ఆదేశించారని గుర్తుచేశారు. రెండేళ్లు గడిచినా కార్యదర్శి బిల్లు పెట్టకుండా ఇబ్బంది పెడుతున్నాడని విచారం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో బోరు పాడు కావడంతో మళ్లీ బాగుచేయించడానికి బిల్లు పెట్టాలని కోరితే పెట్టలేదని వాపోయారు. అడిగితే నాయకులతో ఇబ్బంది వస్తుందని కార్యదర్శి అంటున్నారని తెలియజేశారు. ఇదేసమయంలో తాగునీటి సమస్యపై గ్రామస్తులు నిలదీయడంతో ధర్నా చేయాల్సి వచ్చిందన్నారు. సమస్యను ఎంపీడీఓ శివప్రసాద్, ఈవోపీఆర్డీ దయసాగర్ దృష్టికి తీసుకెళ్లానని పేర్కొన్నారు.

భూత వాహనంపై పల్లికొండేశ్వరుడి దివ్య స్వరూపం



నాగలాపురం, మార్చి 4: సురుటుపల్లె పల్లికొండేశ్వరాలయంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం పల్లికొండేశ్వరుడు భూత వాహనంపై భక్తులను అనుగ్రహించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటక తదితర సదూర ప్రాంతాల నుంచి వందలాది భక్తులు తరలివచ్చారు. శివనామ స్మరణతో ఆలయం మార్మోగింది. ఉదయం ఆలయ ప్రధాన అర్చకుడు కార్తికేశన్ గురుక్కల్ పరివార దేవతలకు అభిషేకాలు చేశారు. సాయంత్రం యాగశాల మండపంలో శాస్త్రోక్తంగా యాగశాల పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలోని మూలస్థాన మూర్తులు వాల్మీకేశ్వర స్వామి, మరగదాంబికా అమ్మవార్ల ఉత్సవర్లకు పంచామృతాలతో అభిషేకాలు చేపట్టారు. స్వామి, అమ్మవార్లను పట్టువస్త్రాలతో సుందరంగా ముస్తాబు చేసి నక్షత్ర హారతి, కుంభ హారతి, మహా హారతులు చేపట్టారు. తర్వాత భూత నాథుడు పార్వతీ దేవితో భూత వాహనాన్ని అధిరోహించి మంగళ వాయిద్యాల సవ్వడి, కోలాటాల కోలాహలం, బాణసంచా పేలుళ్ల నడుమ తిరువీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. సుమారు 2 గంటల సేపు పాటు జరిగిన ఊరేగింపు కనుల పండువగా సాగింది. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్న పరవశించి పోయారు. ఈ పూజలకు చెన్నైకి చెందిన జగన్నాథ్, రాధిక కుటుంబసభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈ పూజా కార్యక్రమాలను ఆలయ చైర్మన్ ఏవీఎం బాలాజీరెడ్డి నేతృత్వంలో బోర్డు సభ్యులు, ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు.

మాడవీధులను అపవిత్రం చేయొద్దు: సుధీర్



మాట్లాడుతున్న సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, మార్చి 4: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తి చతుర్మాడ వీధులను వైసీపీ ఫ్లెక్సీలతో అపవిత్రం చేయొద్దని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొజ్జల సుధీర్ రెడ్డి హితవు పలికారు. ఊరందూరులోని తన స్వగృహంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు చతుర్మాడ వీధుల్లో దేవతల ఫ్లెక్సీలు తప్ప... ఎలాంటి రాజకీయ పార్టీల నేతల ఫ్లెక్సీలు ఏర్పాటు చేయకూడదని పురపాలక సంఘం కౌన్సిల్‌లో తీర్మానం చేశామన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నంత కాలం ఈ నియమం అమలు చేశారన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక మాడవీధుల్లో ఎక్కడ పడితే అక్కడ రాజకీయ పార్టీల నేతల ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారన్నారు. కనీసం మహ శివరాత్రి సమ యంలోనూ నేతల ఫ్లెక్సీలు తొలగించ లేదన్నారు. దీనిపై పుర పాలక శాఖ అధి కారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవ డం లేదన్నారు. తేరువీధిలో భిక్షాల గాలి గోపురం సమీపంలో మహాత్మాగాంధీ విగ్రహాన్ని స్థాన చలనం చేయడం బాధాకరమన్నారు. గాంధీ విగ్రహాన్ని మొదట ఉన్న చోటనే పెట్టాలని కోరారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదనరెడ్డి తీరు చూస్తుంటే శ్రీకాళహస్తీశ్వ రాలయంలో శివలింగం తొలగించి వైఎస్ విగ్రహం ఏర్పాటు చేసేలా ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

జయహో బీసీ సభను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గురవారెడ్డి

శ్రీకాళహస్తి, మార్చి 4: గుంటూరులో మంగళవారం జరిగే జయహో బీసీ బహిరంగ సభను విజయంవంతం చేయాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శిలు గురువారెడ్డి పిలుపునిచ్చారు. శ్రీకాళహస్తిలోని ఆయన కార్యాలయంలో సోమవారం టీడీపీ బీసీ నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనతో బీసీలపై దాడులు, అరాచకాలు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ అభ్యున్నతి కోసం చంద్ర బాబు గుంటూరులో నిర్వహించే జయహో బీసీ సభలో బీసీ డిక్లరేషన్ ప్రకటిస్తారని తెలిపారు. బీసీలంతా చంద్రబాబును ముఖ్య మంత్రిగా చేసుకునేందుకు శక్తివంచన లేకుండా కృషిచేయాలని కోరారు. ఇందులో భాగంగా గుంటూరు సభకు శ్రీకాళహస్తి నియోజకవర్గం నుంచి బీసీలు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ నాయకులు ఈశ్వర్ రెడ్డి, సురేంద్రయాదవ్, మునెయ్య తదితరులు పాల్గొన్నారు.

- జయహో బీసీ సభకు బీసీలంతా తరలిరావాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దశరథాచారి పిలుపునిచ్చారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బీసీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు ఉమేష్ రావు పాల్గొన్నారు.